www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

Published From : Vijaywada - Hyderabad - Delhi - Bengaluru
శనివారం 28, జూన్, 2025 | పేజీలు :12



02

## భవిష్యత్తు పర్యాటక రంగానిదే.. లక్షల్లో ఉద్యోగాలు!



03

## తహసీల్దార్లు కావలెను!



04

## సింగయ్య మృతి కేసు.. జగన్ వాహనం చెకింగ్!

# ఇది సాధ్యమేనా సీఎం గారూ?

**గంజాయి, డ్రగ్స్‌ను తరిమికొడతామన్న సీఎం చంద్రబాబునాయుడు**

**గ్రౌండ్ లెవెల్ రియాలిటీలో డిఫరెంట్ సిట్యుయేషన్**

**స్కూళ్లు, కాలేజీలు హబ్‌లుగా మారిన పరిస్థితి**

**యూత్ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్న పరిస్థితి.**

**నగరాలే కాకుండా గ్రామాలకూ విస్తరించిన జాడ్యం**

**పాన్ షాపుల్లో సైతం దొరుకుతున్న పరిస్థితి**

**అసలు గంజాయి పంటను నాశనం చేయాలని నిపుణుల అభిప్రాయం. అది చేస్తేనే పరిష్కారం**

**మావోయిస్టులను ఆపినవాళ్లు.. ఈ గంజాయి పంటను నాశనం చేయలేరా..?**

**ఈగల్ టీమ్ పెట్టినా.. వాటికి లేని ఫండ్స్, అధికారాలు**

**సరైన వ్యూహంతో వెళితేనే సీఎం కోరిక నెరవేరే అవకాశం**





**టీపీఎన్, అమరావతి :**

గంజాయి, డ్రగ్స్ మొత్తాన్ని నిర్మూలిస్తాం.. ఎవరు అడ్డొచ్చినా తొక్కుకుంటూ పోతామన్నారు సీఎం చంద్రబాబునాయుడు. ఇప్పుడు దీని మీదే డిస్కషన్ నడుస్తోంది. ఎవరు వాటిల్లో ఇన్ వాల్వ్ అయినా వదిలిపెట్టేది లేదని గట్టిగానే వార్నింగ్ ఇచ్చారు సీఎం. అయితే చంద్రబాబు ఆలోచనలు, విజన్, ఉద్దేశాలు అన్నీ కరెక్టుగానే ఉన్నాయి. కాని అవి స్టేట్ మెంట్లు ఇవ్వడానికో... అధికారులకు ఆదేశాలు ఇవ్వడానికో పరిమితం అయితే ఎలా? అనే ప్రశ్న వస్తోంది. నిజంగా గంజాయి, డ్రగ్స్ సరఫరాలు ఆపాలంటే దానికి అవసరమైన కార్యాచరణ ఉండాలంటున్నారు నిపుణులు.

హార్డ్ వర్క్ కాదు.. స్మార్ట్ వర్క్ కావాలని ఈ మధ్య పదే పదే సీఎంగారు చెబుతున్నారు. అదే ఇక్కడ కూడా అప్లయ్ చేయాలి. ముందు అసలు గ్రౌండ్ లెవెల్ రియాలిటీ ఏంటో తెలుసుకోవాలి. గత ఐదేళ్లలో ఎలా జరిగిందో.. ఇప్పుడు కూడా గంజాయి, డ్రగ్స్ సరఫరా అలాగే జరుగుతోంది. ఒక్కటే తేడా.. అప్పుడు రాజకీయ నాయకుల పాత్ర కూడా ఉండేది.. ఇప్పుడు లేదు అంతే. ఇప్పుడు కూడా కొన్ని ఏరియాల్లో కొందరు నేతలు ఇన్ వాల్వ్ అవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

అరకు, ఒడిశా, పోలవరం లాంటి ఏజెన్సీ ఏరియాల్లో గంజాయి పంటను పండిస్తున్నారు. ఒక అధికారి మాట్లాడుతూ పెద్ద ఎత్తున టీమ్స్‌ను పెట్టి ఈ గంజాయి, డ్రగ్స్ రవాణాను అడ్డుకోవడం.. ఎక్కడ అమ్ముతున్నారో తనిఖీలు చేపట్టడం కంటే.. ఎక్కడి నుంచి వస్తుందో అంటే సోర్స్ పాయింట్‌ను నాశనం చేస్తేనే అసలు లక్ష్యం నెరవేరుతుంది. గంజాయి పంట నాలుగు నెలల్లో వస్తుంది. ఈ నాలుగు నెలల్లో ఏ స్టేజిలో అయినా సరే మనం నాశనం చేయొచ్చు. అది ఎందుకు చేయలేకపోతున్నాం? వందల ఎకరాల్లో, లక్షల టన్నుల గంజాయి పండుతుంటే.. మనం సరఫరాను ఎలా ఆపగలం?". ఆయన చెప్పిన లాస్ట్ పంచ్ లైన్ ఏంటంటే "అంత పెద్ద మావోయిస్టు వ్యవస్థను లేకుండా చేశాం. ఈ గంజాయి పంటను నాశనం చేయలేమా?".

ఇక డ్రగ్స్ అయితే బెంగళూరు, ఢిల్లీ, ఇతర ప్రాంతాల నుంచి మన స్టేట్ కు వస్తున్నాయి. స్కూళ్లు, కాలేజీలు ఈ గంజాయి, డ్రగ్స్ కు కేంద్రాలు మారిపోతున్నాయి. చాలామంది యూత్ జీవితాలు నాశనం అయిపోతున్నాయి. చాలా కుటుంబాల్లో ఈ పరిస్థితిని మనం చూస్తూనే ఉన్నాం. నగర ప్రాంతాల్లోనే కాకుండా.. గ్రామాల్లో కూడా ఇది బాగా విస్తరించేసింది. విజయవాడ లాంటి చోట్ల ఒక యూనివర్శిటీ క్యాంపస్ కూడా హబ్‌గా మారిపోయిందంటే సిట్యుయేషన్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. చివరకు పాన్ షాపుల్లో కూడా అమ్ముతున్నారంటే ఏమనుకోవాలి?

మరో అధికారి అభిప్రాయం ప్రకారం "వైసీపీ హయాంలో సరైన స్టాండర్డ్స్ లేని లిక్కర్ ఎక్కువ రేట్లకు అమ్మారు. దీంతో యూత్ ప్రత్యామ్నాయంగా గంజాయి, డ్రగ్స్ వైపు మళ్లారు. దాంతో ఇది పెరిగిపోయింది. కోవిడ్ లాక్ డౌన్ కూడా ఒక కారణమైంది. ఇప్పుడు వాటికి అలవాటుపడ్డవారు వదల్లేకపోతున్నారు"

కూటమి ప్రభుత్వం వచ్చాక ఈగల్ టీమ్ పెట్టారు. కాని దానికి ఫండ్స్ ఇవ్వలేదు. అధికారాలు ఇవ్వలేదు. చట్టప్రకారం ఏవీ లేవు. ఆఖరికి దిశ వాహనాల పెయింట్ మార్చి అవి వాళ్ల మొహాన పడేశారు. ఇక ఎలా పని చేస్తారు వాళ్లు? అంత పెద్ద యుద్ధంలో వారిని దింపి ఆయుధాలు ఇవ్వలేదు.. ఎలా అవుతుంది మరి?

మొదటగా గంజాయి పంటలను ధ్వంసం చేయాలి. ఆ తర్వాత రవాణా జరగకుండా చూడాలి. ఈగల్ టీమ్ కు సరైన అధికారాలతో పాటు ఫండ్స్ కూడా ఇచ్చి సౌకర్యాలు కల్పించాలి. ఇప్పటికైనా పెద్ద పెద్ద ప్రకటనలు, ఆర్భాటం కాకుండా సరైన వ్యూహంతో ముందుకెళ్లాలి.. అప్పుడే సీఎం కోరుకుంటున్న గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రం సాధ్యమవుతుందని నిపుణులు గట్టిగా అభిప్రాయపడుతున్నారు.



# మధురపూడి లే అవుట్స్‌కు ముప్పు!

**అహ్మదాబాద్ విమాన ప్రమాదంతో మారిన నిబంధనలు**

**ఎయిర్ పోర్ట్స్ సమీపంలోని భవనాలపై ఆంక్షలు**

**పరిమిత ఎత్తు దాటితే కూల్చివేతే..!**

**ముసాయిదా నిబంధనలు విడుదల చేసిన కేంద్రం**

**సీహెచ్ శ్రీ, టీపీఎన్, రాజమండ్రి :**

ఎంకి పెళ్లి సుబ్బి చావుకి వచ్చిన చందంగా తయారైంది మధురపూడి ఎయిర్ పోర్ట్ సమీపంలోని లేఅవుట్లు పరిస్థితి. ఇటీవల గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 274 మంది మృతి చెందడంపై.. విమాన ప్రయాణాల మీద, ఎయిర్‌పోర్ట్ పరిసర ప్రాంతాల మీద కేంద్రం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టుల సమీపంలోని భవనాలు నిబంధనలకు లోబడి ఉండాలి అంటూ ముసాయిదా రూల్స్ జారీ చేసింది. దీంతో రాజానగరం నియోజకవర్గ పరిధిలోని మధురపూడి విమానాశ్రయం ప్రాంతంలోని లేఅవుట్లపై ఈ నిబంధనలు ప్రభావం చూపుతున్నాయి. మధురపూడి విమానాశ్రయం సమీపంలో అధిక సంఖ్యలో లేఅవుట్స్ వెలిశాయి. ప్రస్తుతం విమానాశ్రయ పరిధిలో ఎటువంటి అనధికార నిర్మాణాలు చేపట్టేందుకు అవకాశం లేదు. ఒకవేళ ఏదైనా నిర్మాణం చేపట్టాల్సి వస్తే ఎయిర్‌పోర్ట్ అథారిటీ నుంచి ఎన్‌వోసీ పొందాల్సి ఉంటుంది. అయితే ఇటీవల జరిగిన విమాన ప్రమాదం నేపథ్యంలో ఇలాంటి ఎన్వోసీలు జారీ చేసే అవకాశం లేదు. దీంతో ఎయిర్‌పోర్ట్ చుట్టుపక్కల ఉన్న లేఅవుట్స్ యజమానుల గుండెల్లో గుబులు మొదలైంది.

ఇప్పటికే విమానాశ్రయం సమీపంలో ఉన్న లేఅవుట్‌స్‌లో డ్రోన్ ఎగరవేయడానికి కూడా అవకాశం లేదంటే నిబంధనలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ నిబంధనలను కొనుగోలుదారులకు అవగాహన కల్పించకుండా లేఅవుట్స్ యజమానులు ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ లేఅవుట్‌స్‌లో భూమిని కొనుగోలు చేసి నిర్మాణాల పరిమితిని దాటి నిర్మిస్తే కూల్చివేత తప్పదంటూ కేంద్ర ముసాయిదా రూల్‌స్‌లో స్పష్టంగా తెలియజేసింది. ఎయిర్ పోర్టుల చుట్టూ విమాన కార్యకలాపాలకు అంతరాయాన్ని కలిగించే భవనాలు, చెట్లు వంటి అడ్డంకుల నియంత్రణ, తొలగింపుపై కేంద్రప్రభుత్వం ముసాయిదా నియమాలను జారీ చేసింది. భారతీయ వాయుయాన్ అధినియం2024 కింద ఈ 'ది డ్రాఫ్ట్ ఎయిర్ క్రాఫ్ట్ రూల్స్'ను విడుదల చేసింది. వీటిపై 2 రోజులపాటు ప్రజల అభిప్రాయాలను సేకరించనుంది. ఎయిర్ క్రాఫ్ట్ రూల్స్1994 స్థానంలో కొత్త నియమాలను తీసుకురావాలనే ఉద్దేశంతో కేంద్రం తాజా ప్రతిపాదనలు చేసింది. ప్రభుత్వ నోటిఫికేషన్లలో ఉన్న పరిమితులను ఉల్లంఘించిన నిర్మాణాలపై డీజీసీఏ చర్యలు తీసుకొనే అధికారాన్ని కొత్త నిబంధనలు కల్పిస్తున్నాయి. ఎయిర్‌పోర్ట్ సమీపంలో లేఅవుట్లు.. భద్రత పట్ల నిర్లక్ష్యమా..?

మధురపూడి విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో లేఅవుట్స్ వేయడం, హౌసింగ్ ప్రాజెక్టులు ప్రారంభం కావడం ఇటీవలే శరవేగంగా జరుగుతోంది. అయితే అహ్మదాబాద్ విమాన ప్రమాదం నేపథ్యంలో, విమానాశ్రయాల సమీప భూభాగాలపై భద్రతా మరింత కఠినంగా మారింది. రాజమండ్రి మధురపూడి ఎయిర్‌పోర్ట్‌కు సమీపంలో నాలుగు నుంచి ఐదు వరకు పలు ప్రైవేట్ రియల్ ఎస్టేట్ కంపెనీలు లేఅవుట్స్ వేసి ప్లాట్లు అమ్మకానికి పెట్టాయి. కొన్నింటిలో ఇప్పటికే ఇంటి నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. అయితే.. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) నిబంధనల ప్రకారం విమానాశ్రయం పరిసర ప్రాంతాల భవనాల ఎత్తు, నిర్మాణాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి.

**అహ్మదాబాద్ ఘటన అనంతరం అప్రమత్తమైన అధికారులు**

అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న విమాన ప్రమాదంతో.. పలు రాష్ట్రాల్లో ఎయిర్‌పోర్ట్ పరిసరాల్లో భద్రతా చర్యలు పునఃపరిశీలనకు గురవుతున్నాయి. ఆ ఘటనలో మిగతా 2వ పేజీలో..

# ధర్మాన చూపు.. జనసేన వైపు!



**రాజశేఖర్, టీపీఎన్, శ్రీకాకుళం :**

వైసీపీ కీలక నాయకుడు, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు రాజకీయాల్లో కీలక యూటర్న్ తీసుకుంటున్నారా..? వైసీపీకి ఆయన గుడ్ బై చెబుతున్నారా..? అంటే.. ఔననే అంటున్నాయి ఉత్తరాంధ్ర రాజకీయ వర్గాలు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ధర్మాన ప్రసాదరావు.. శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి పలు మార్లు విజయం దక్కించుకున్నారు. రాజకీయ పరిణితి.. విశ్లేషణాత్మక పనితీరు వంటివి ఆయనను రాజకీయాల్లో కీలక స్థానానికి చేర్చాయి. కాంగ్రెస్ హయాంలోనే వైఎస్ మంత్రి వర్గంలో చోటు సంపాదించుకున్న ధర్మాన.. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకంగా తీర్మానాలు చేయించారు. ఈ క్రమంలోనే ఆయన కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఉన్నారు. అయితే.. అప్పటి వైసీపీపై ఆయన అనేక విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో జగన్ కూడా ఆయనకు దూరంగానే ఉన్నారు. అయితే.. తర్వాత తర్వాత.. ప్రత్యామ్నాయ రాజకీయాలు చేయలేకపోవడంతో వైసీపీ చెంతకు చేరారు. 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున శ్రీకాకుళం నుంచి విజయం దక్కించుకున్న ధర్మాన.. అప్పటి జగన్ మంత్రివర్గంలో రెండో దఫాలో చేరారు. కీలకమైన రెవెన్యూ పగ్గాలు చేపట్టారు. పార్టీ తరపున కంటే కూడా విధానాల పరంగా ఆయన టీడీపీని కార్నర్ చేస్తూ వచ్చారు. ఇక, గత ఎన్నికల్లో తన కుమారుడికి అవకాశం ఇప్పించుకునే ప్రయత్నాలు చేసినా.. జగన్ కాదన్నారు. దీంతో మొక్కుబడిగానే ధర్మాన గత ఎన్నికల్లో పోటీ చేశారు. కూటమి ప్రభావంతో ఓడిపోయారు. ఆ తర్వాత వైసీపీ విధానాలు నచ్చకపోవచ్చు, లేదా అధినేతపై ఆగ్రహంతో కావొచ్చు.. ధర్మాన పార్టీకి దూరంగా ఉంటున్నారు.

ఐతే.. ఎన్నికలప్పుడు యాక్టివ్‌గా ఉండడం.. ఆ తర్వాత సైలెంట్‌గా తన పని తాను చేసుకుపోవడం ధర్మాన స్టైల్. దీంతో ఆయన ఎన్నికల తర్వాత మౌనంగా ఉండడంతో.. ఆయన తన స్టైల్‌ను అనుసరిస్తున్నారని ఆయన అనుచరులు కూడా భావించారు. కానీ.. ఈసారి ఆయన రూట్ మార్చుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. వైసీపీని వీడి వేరే పార్టీలో చేరుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆయన పక్కా కాంగ్రెస్ వాది మిగతా 2వ పేజీలో..







# భవిష్యత్తు పర్యాటక రంగానిదే.. లక్షల్లో ఉద్యోగాలు!

- విజయవాడలో జీఎఫ్ఎస్టీ కాన్క్లేవ్
- రాష్ట్ర పర్యాటక రంగంలో కీలక ఒప్పందాలు
- రూ. 10,329 కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు
- రాష్ట్ర పర్యాటక సలహాదారుగా బాబా రామ్‌దేవ్ బాధ్యతలు
- చంద్రబాబుపై రామ్‌దేవ్ బాబా ప్రశంసలు

**టీపీఎన్, విజయవాడ:**

ప్రపంచ పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను వెల్‌నెస్, హ్యాపీనెస్ ఫ్యూచర్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు సీఎం చంద్రబాబు. గ్లోబల్ టూరిజం డెస్టినేషన్‌గా ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలబెడతామన్నారు. పర్యాటక రంగం రాష్ట్ర భవిష్యత్తుకు గేమ్ ఛేంజర్ లాంటిదని, అందుకే ఈ రంగానికి పారిశ్రామిక హోదా కల్పించామని స్పష్టం చేశారు సీఎం. విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్ హోటల్‌లో శుక్రవారం జరిగిన గ్లోబల్ ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ టూరిజం కాన్క్లేవ్‌కు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాన్క్లేవ్‌లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర పర్యాటక రంగంలో కీలక ఒప్పందాలు జరిగాయి. మొత్తం 82 ప్రాజెక్టులకు సంబంధించి రూ. 10,329 కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలపై ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థతో పలు కంపెనీలు సంతకాలు చేశాయి. అనంతరం, ముఖ్యమంత్రి చంద్రబాబు, బాబా రామ్‌దేవ్‌తో కలిసి పర్యాటక బ్రోచర్, కాఫీ టేబుల్ బుక్, పర్యాటక ఈవెంట్ల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు, హోటల్ గదుల తరహాలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన టూరిజం క్యారవాన్‌లను సీఎం జెండా ఊపి ప్రారంభించారు.

**భవిష్యత్తు మొత్తం పర్యాటక రంగానిదే..!**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ భవిష్యత్తు మొత్తం పర్యాటక రంగానిదే అని చెప్పారు. అన్ని 'ఇజం'ల కన్నా టూరిజమే గొప్పదని తాను దశాబ్దాల క్రితమే చెప్పిన మాట ఇప్పుడు నిజమవుతోందన్నారు చంద్రబాబు. వ్యవసాయం, ఐటీ, తయారీ రంగాల కన్నా ఎక్కువగా ఉద్యోగాలు కల్పించే సత్తా ఒక్క పర్యాటక రంగానికే ఉందన్నారు. ఈ రంగం 20 శాతం వృద్ధి సాధించగలదని అభిప్రాయపడ్డారు. పెట్టుబడులను ఆకర్షించేలా, ప్రజలకు ఆరోగ్యం, సంపద, ఆనందాన్ని పంచేలా 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ' నినాదంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఏపీలో కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయం, శ్రీశైలం మల్లన్న సహా అనేక పుణ్యక్షేత్రాలు, వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం, కోనసీమ అందాలు, హార్సిలీ హిల్స్ వంటివి రాష్ట్రానికి గొప్ప ఆకర్షణలని తెలిపారు ముఖ్యమంత్రి. అఖండ గోదావరి ప్రాజెక్టుకు కూడా అంకురార్పణ జరిగిందన్నారు.

**పెద్దబడులకు పెద్దపీట..!**

రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టులకు అత్యంత వేగంగా అనుమతులు మంజూరు చేస్తామని పెట్టుబడిదారులకు చంద్రబాబు హామీ ఇచ్చారు. అనుమతుల కోసం ఒక్క సెకను కూడా ఆలస్యం చేయకుండా రియల్ టైంలో అనుమతులు ఇచ్చేందుకు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు సీఎం చంద్రబాబు. కూటమి ప్రభుత్వంలో అవినీతికి తావులేదని.. కేవలం పారదర్శకత, జవాబుదారీతనం మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. పర్యాటక ప్రాజెక్టులకు విద్యుత్ సబ్సిడీలతో పాటు అనేక ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3 వేల హోటల్ గదులు ఉండగా, రాబోయే నాలుగేళ్లలో ఈ సంఖ్యను 15 వేలకు పెంచడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులకు మరిన్ని ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. మూడు దశాబ్దాల క్రితం తాను ఐటీ రంగాన్ని ప్రోత్సహించినప్పుడు ఎవరూ నమ్మలేదని, కానీ ఇప్పుడు దాని ఫలాలను తెలుగువారే ప్రపంచవ్యాప్తంగా పొందుతున్నారని చంద్రబాబు గుర్తుచేశారు. ఇప్పుడు వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్ అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని.. ఈ లక్ష్యం కూడా త్వరలోనే నెరవేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు సీఎం. దేశీయంగా తయారైన ప్రతి ఉత్పత్తిలో అంతర్జాతీయ స్థాయి ఉండాలన్నారు సీఎం. సరైన సమయానికి సరైన వ్యక్తి మనకు ప్రధానిగా ఉన్నందున మన దేశంలో బిలియనీర్లు బాగా పెరుగుతున్నారని చెప్పారు. పేదవాళ్లను పైకి తెచ్చేందుకు అందరం కృషి చేయాలన్నారు. సరైన ప్రణాళికతో ముందుకెళ్తే ప్రజలే గొప్ప సంపదగా మారతారని తెలిపారు. టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు పోతాయని యువత భయపడుతున్నారు. నైపుణ్యం పెంచుకొని స్మార్ట్ వర్క్ చేస్తే ఉద్యోగాలు ఎక్కడికీ పోవు అని చంద్రబాబు తెలిపారు.

**పెట్టుబడులకు ఇదే సరైన సమయం..!**

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన, సురక్షితమైన సమయం అని పిలుపునిచ్చారు చంద్రబాబు. త్వరలో అమరావతిలో క్వాంటం వ్యాలీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని విస్తృతంగా అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో వెల్‌నెస్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు పర్యాటక సలహాదారుగా బాబా రామ్‌దేవ్ వ్యవహరించాలని ఆయనను కోరారు సీఎం చంద్రబాబు. యోగా ద్వారా ప్రజల్ని మీరు ఎలా ప్రభావితం చేశారో, అదే విధంగా ఏపీ పర్యాటక రంగానికి బ్రాండింగ్ చేసి పెట్టుబడులు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. చిత్తూరు జిల్లా మదనపల్లిలో ఏర్పాటు చేయబోయే వెల్‌నెస్ సెంటర్‌ను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దాలని కోరారు.

### దేవుడు పంపిన గొప్ప గిఫ్ట్ చంద్రబాబు : రాందేవ్ బాబా

అనంతరం బాబా రామ్‌దేవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విజనరీ లీడర్ అని, దేశంలో ఆయనతో పోల్చదగిన ప్రజాహిత నాయకుడు మరొకరు లేరని కొనియాడారు. చంద్రబాబు నాయకత్వ పటిమపై ప్రశంసల జల్లు కురిపించారు. తెలుగు ప్రజల కోసం దేవుడు పంపిన వరంగా చంద్రబాబును అభివర్ణించారు. సృజనాత్మకత, ఉత్పాదకత, వృత్తి నైపుణ్యం, సామర్థ్యం వంటి గుణాలకు చంద్రబాబు కేరాఫ్ అడ్రస్ అన్నారు. రాష్ట్ర ప్రగతి కోసం ఆయనకున్న దార్శనికత మరెవరికీ లేదన్నారు. రాష్ట్ర పర్యాటక రంగాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపడానికి ముఖ్యమంత్రి చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని బాబా రామ్‌దేవ్ ప్రకటించారు. చిత్తూరు జిల్లాలోని హార్సిలీ హిల్స్‌లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఒక వెల్‌నెస్ సెంటర్‌ను పతంజలి సంస్థ ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. అదేవిధంగా, కోనసీమలోని దిండి వంటి ప్రాంతాల్లో 'వెడ్డింగ్ క్రూయిజ్ బోట్' తరహా ప్రాజెక్టును చేపట్టేందుకు ఆసక్తిగా ఉన్నామన్నారు. భారతీయ సంప్రదాయ వివాహ వేడుకలను నిర్వహించేందుకు వీలుగా 'డెస్టినేషన్ వెడ్డింగ్' ప్రాజెక్టును అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తే, ఏపీ పర్యాటకానికి తాను ప్రచారకర్తగా వ్యవహరిస్తానని ఆయన ముందుకొచ్చారు. కార్యక్రమం అనంతరం, హరిద్వార్ నుంచి తెచ్చిన పవిత్ర గంగాజలాన్ని చంద్రబాబుకు అందజేశారు.



# మధురపూడి లే-అవుట్స్‌కు ముప్పు!

**మొదటిపేజీ తరువాయి**

రన్‌వే సమీపంలో ఉన్న అక్రమ నిర్మాణాలే ప్రమాదానికి దారితీశాయని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ నేపథ్యంలో.. రాజమండ్రిలో కూడా సమీపంలోని భవనాలు, టవర్స్ నిర్మాణాలపై ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది..

**ఎయిర్‌పోర్ట్-మానవుల భద్రతా చట్టం ఏం చెబుతోంది..?**

ఎయిర్ క్రాఫ్ట్ (పబ్లిక్ హెల్త్, సేఫ్టీ మరియు నావిగేషన్) చట్టం ప్రకారం నిర్మాణాలకు ముందు ఏవియేషన్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (AAI) నుండి అనుమతి తప్పనిసరి. అలాగే రన్‌వే ఎండ్ సేఫ్టీ జోన్‌లో ఎత్తైన నిర్మాణాలు, గాజు బిల్డింగులు కూడా నిషేధం. వీటి ప్రకారం విమానాశ్రయం చుట్టుపక్కల 20 కిలోమీటర్ల అనుమతులు ఇచ్చిన రుడా, మున్సిపాలిటీలు, పంచాయతీలపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలుచోట్ల మున్సిపాలిటీలు, రుడా, పంచాయతీలు స్థల అనుమతులు ఇచ్చిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎయిర్‌పోర్ట్ భద్రతా నియమాలను పక్కన పెట్టి "లేఅవుట్ ఫైనలైజేషన్" పేరుతో అనుమతులు ఇవ్వడంపై ప్రజాసంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే రాజమండ్రిలోని మధురపూడి సమీపంలోని కొన్ని లే అవుట్స్‌ను పరిశీలనలోకి తీసుకున్నట్లు సమాచారం.

**ప్రజలకు హెచ్చరిక భద్రత ప్రధానం..!**

రియల్ ఎస్టేట్ లబ్ధి ఆశించి ఎయిర్‌పోర్ట్ సమీప భూములను కొనుగోలు చేయబోతున్నవారు.. ముందుగా AAI, DGCA వారి నిబంధనలను పూర్తిగా పరిశీలించాలి. లేదంటే, భవిష్యత్తులో నిర్మాణాలపై నిషేధాలు లేదా రద్దు చర్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. కాబట్టి ఈ లేఅవుట్స్‌లో భూములు కొనుగోలు చేయాలనుకునేవారు తస్మాత్ జాగ్రత్త..

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరించిన మంత్రి సుభాష్

**టీపీఎన్, రామచంద్రపురం:**



ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే ప్రభువులని, వారి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం రామచంద్రపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ నిర్వహించి వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలు విని, తక్షణ పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంపై అపారమైన నమ్మకంతో, విశ్వాసంతో అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలిచి అత్యధిక విజయం చేకూర్చారని, వారి సమస్యలు పరిష్కరించడం తమ బాధ్యత అన్నారు. ప్రజల పక్షాన, ప్రజా సమస్యల పరిష్కారం దిశగా అమరావతి లోను, నియోజకవర్గాల్లోనూ ప్రజాదర్బార్లు నిర్వహించి నేరుగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసేందుకు వెనుకాడదన్నారు. రామచంద్రపురం నియోజవర్గంలోని పలు గ్రామాల ప్రజలు ప్రజా దర్బార్‌కు హాజరై వినతి పత్రాలు అందించారు. ఇదిలా ఉంటే మంత్రి సుభాష్ ప్రభుత్వ పరంగానే కాకుండా సామాజిక బాధ్యతగా తన తండ్రి చైర్మన్ గా ఉన్న "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్" ద్వారా, వ్యక్తిగతంగా అనేక సంక్షేమ, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతుండడంతో అర్జీదారులు అధిక సంఖ్యలో వచ్చారు.





# విభిన్న ప్రతిభావంతులకు అండగా ఉంటాం!

**టీపీఎన్, శ్రీకాకుళం :**

విభిన్న ప్రతిభావంతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు హామీ ఇచ్చారు. స్థానిక మిల్ జంక్షన్ కూడలిలోని ఒక ప్రైవేట్ హాల్‌లో ట్రై సైకిల్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రతీ దివ్యాంగుడికీ అండగా ఉంటుందని.. ఎయిర్ అథారిటీ ఆఫ్ ఇండియా సౌజన్యంతో , కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు విభిన్న ప్రతిభావంతులకు అండగా ఉంటున్నారని చెప్పారు. ఆయన ఆలోచనా తీరు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఇప్పటికే పూర్తిస్థాయిలో విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిల్ అందించామని, ఇంకా ఎవరైనా ఉంటే తనకు స్వతహాగా సమాచారమిస్తే తప్పకుండా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విభిన్న ప్రతిభావంతులశాఖ అధికారులు, విభిన్న ప్రతిభావంతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ధర్మాన చూపు.. జనసేన వైపు!

**మొదటిపేజీ తరువాయి**

కాబట్టి మొదట ఆయన కాంగ్రెస్‌వైపు చూస్తున్నారనే ప్రచారం జరిగింది. కానీ.. విభజన తర్వాత ఆయన కాంగ్రెస్ వైపు మళ్లీ చూడలేదు. దీంతో ఆయన హస్తం పార్టీలో చేరే ఛాన్స్ చాలా తక్కువ. ఆ తర్వాత సిద్ధాంతపరంగా ఆయన టీడీపీకి బద్ధ వ్యతిరేకి.. సో.. టీడీపీలో చేరే అవకాశం లేదు. దీంతో ఇక రాష్ట్రంలో ఇప్పుడు మంచి క్రేజ్ ఉన్న పార్టీ జనసేన. అందులోనూ ఇప్పుడు ఆ పార్టీకి బలమైన నేతలు కావాల్సిన అవసరం ఉంది. దీంతో ఆయన జనసేనలో చేరాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. పైగా శ్రీకాకుళం జనసేనలో ధర్మాన రాకను అడ్డుకునే పెద్ద తలకాయలు ఎవరూ లేక పోవడంతో.. ఆయన రాక లాంఛనమే అనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఆయన వైసీపీకి రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్టుగా నియోజకవర్గంలో చర్చ సాగుతోంది. ముఖ్యంగా తన కుమారుడి భవిష్యత్తు కోసం ధర్మాన వైసీపీకి రిజైన్ చేయాలని భావిస్తున్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. మరి ఏం చేస్తారో ధర్మాన ఏ దారి ఎంచుకుంటారో చూడాలి.



## వాటర్ సప్లై ఉద్యోగులు ధర్నా.. విశాఖ ప్రజలకు నీటి కష్టాలు!

**టీపీఎన్, విశాఖ:**

గ్రేటర్ విశాఖలో మంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో 18గంటలకు పైగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కేజీహెచ్, ఎయిర్ పోర్ట్, పాఠశాలలకు మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో అవస్తలు పడ్డారు. జీతాలు పెంచలేదంటూ వాటర్ సప్లై ఉద్యోగులు సమ్మెకు దిగారు. జీవీఎంసీ పరిధిలో జిల్లా వ్యాప్తంగా సుమారు 1250 మంది వాటర్ సప్లై ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. నిన్నటి నుంచి వాటర్ సప్లై ఉద్యోగులు సమ్మె చేయడంతో విశాఖలో తీవ్రరూపం దాల్చింది. తమ న్యాయమైన డిమాండ్‌ను తీర్చే వరకూ సమ్మె నుంచి వెనక్కి తగ్గేది లేదన్నారు ఉద్యోగులు. తమను ఉద్యోగాల నుంచి తీసేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే 11వ తేదీ నుంచి సమ్మె చేస్తామని నీటి సరఫరా ఉద్యోగులు హెచ్చరించిన అధికారులు వారి మాటలను లైట్ తీసుకున్నారు. దాంతో వారంతా సమ్మె బాట పట్టారు. ఏపీ సీడీఎంఏ కార్యాలయం ముట్టడికి మునిసిపల్ ఇంజనీరింగ్, వాటర్, లైట్స్, టౌన్ ప్లానింగ్, పార్కింగ్ ఇతర సిబ్బంది పిలుపునిచ్చారు. ముట్టడికి అనుమతి లేదని పోలీసులు తెలిపారు. మున్సిపల్ కమిషనరేట్ కార్యాలయం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ముట్టడికి పూనుకుంటే అరెస్ట్ చేస్తామంటూ హెచ్చరించారు. మరోవైపు గాజువాక జోన్‌లోని కనితి బ్యాలెన్స్ రిజర్వాయర్ దగ్గర కార్మికులు ధర్నా చేపట్టారు. జీవీఎంసీ జోన్ 8 పరిధిలోని మంచి నీటి విభాగం కార్మికులు గురువారం అర్ధరాత్రి సమ్మె చేపట్టారు. జీతాలు పెంచుతామని గతంలో ఇచ్చిన హామీని అధికారులు నెరవేర్చాలని, రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై వినతిపత్రం ఇచ్చినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతోనే సమ్మెకు దిగినట్లు కార్మికులు చెప్పారు. సమ్మె విరమించాలని జీవీఎంసీ ఈఈ ప్రసాద్ శ్రీనివాస్, డీఈ, ఏఈలు కార్మికులతో చర్చలు జరిపారు. అయిన తమ సమస్యలను తీర్చే వరకూ దీక్ష విరమించేదే లేదంటూ భీష్మించుకుకూర్చున్నారు. కార్మికుల సమ్మెతో జోన్ పరిధిలోని 10 వార్డుల్లో ఆసుపత్రులకు, పాఠశాలలకు మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడ్డారు.



## ఈవీ బైక్ పేలి.. వృద్ధురాలు మృతి!

**టీపీఎన్, కడప జిల్లా :**

కడప జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఎలక్ట్రిక్ స్కూటీ పేలి వృద్ధురాలి మరణించింది. ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తిలో ఈఘటన జరిగింది. ఛార్జింగ్ ఎక్కుతుండగా.. ఈవీ బైక్ అకస్మాత్తుగాపేలింది. వెంటనే మంటలు వ్యాపించాయి. పక్కనే నిద్రిస్తున్న వెంకట లక్ష్మమ్మ (62) అనే వృద్ధురాలు ఆమంటల ధాటికి ప్రాణాలు కోల్పోయింది. దీంతో పోట్లదుర్తిలో విషాదం అలముకుంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈవీ బైక్ పేలడానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. మరోవైపు ఈఘటనతో ఎలక్ట్రిక్ వాహనాల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు వాహనదారులు. వాటిని సరైన స్థితిలో ఉపయోగించకపోతే ప్రమాదకరంగా మారే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు. ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ, భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచడం అత్యంత అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# తహసీల్దార్లు కావలెను!

- తూర్పుగోదావరి జిల్లాలో తహసీల్దార్ల కొరత
- 19 మండలాలకు కేవలం 11 మండలాల్లోనే ఎమ్మార్వోలు
- మిగతా 8 మండలాల్లో తహసీల్దార్ పోస్టులు ఖాళీ
- డిప్యూటీ తహసీల్దార్లతోనే కార్యాలయాలు కొనసాగింపు

**సీహెచ్ శ్రీ, టీపీఎన్, తూర్పుగోదావరి జిల్లా :**



ఆంధ్ర రాష్ట్రంలో సుమారు 33 ప్రభుత్వ శాఖలు ఉండగా వీటిలో రెవెన్యూ, హోమ్, విద్య, వైద్యం, వ్యవసాయం ఎంతో కీలకమని చెప్పొచ్చు. వీటిలో ప్రధానమైన శాఖ రెవిన్యూ. అయితే తూర్పుగోదావరి జిల్లాలో 19 మండలాలు ఉండగా వీటిలో కేవలం 11 మండలాలకు (రాజమండ్రి సిటీ, కోరుకొండ, తాళ్లపూడి, నిడదవోలు, ఉండ్రాజవరం, కొవ్వూరు, అనపర్తి, చాగల్లు)మాత్రమే తహసీల్దారులు ఉన్నారు. మిగతా 8 మండలాల్లో (రాజమండ్రి రూరల్, బిక్కవోలు, గోకవరం, పెరవలి, గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, కడియం) తహసీల్దార్లు లేకుండానే పరిపాలన కొనసాగుతుందంటే జిల్లాస్థాయి ఉన్నతాధికారుల, ప్రజాప్రతినిధుల ఉదాసీనత ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది. తూర్పుగోదావరి జిల్లా ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతున్నా.. ఎనిమిది మండలాల్లో తహసీల్దారులు లేకపోవడంతో పరిపాలనా లోపాల వల్ల ప్రజలు నష్టపోతున్నారు. తహసీల్దార్ల కొరత సమస్య కాదు, అది ప్రజా సేవలకు అడ్డుకట్ట. దీన్ని త్వరగా పరిష్కరించకుంటే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పేదలకు అందకుండా పోయే ప్రమాదం ఉంది. తహసీల్దార్ పోస్టులు ఖాళీ అయిన తర్వాత తక్షణమే భర్తీ చేయకపోతే ఆయా కార్యాలయాల పరిపాలనలో తీవ్రమైన ఇబ్బందులు తలెత్తుతాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రజలపై, రైతులపై, పేదవర్గాలపై దీని ప్రభావం తీవ్రంగా పడుతుంది.

**తహసీల్దార్లు లేకపోతే సమస్యలు ఇవే..!**
తహసీల్దార్లు లేని మండలాల్లో గల ప్రజలు ప్రభుత్వ సేవలకు ఎక్కువసేపు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రెవెన్యూ, భూ రికార్డులు, పింఛన్లు, ఇంటికట్టుపై పర్మిషన్లు, సంక్షేమ పథకాలు, పౌర సంబంధ విషయాల్లో నిర్ణయాలు వాయిదా పడుతున్నాయి.

**ప్రభుత్వ సేవల్లో ఆలస్యం:**
రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో ప్రతి పని ఆలస్యం అవుతోంది. పత్రాల క్లియరెన్స్, సర్టిఫికెట్ల జారీ, భూ పట్టాల విషయంలో ప్రజలు నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

**సంస్థాగత అసమర్థత:**
డిప్యూటీ తహసీల్దార్లు ఎక్కువగా ఫీల్డ్ పనుల్లో నిమగ్నమవుతారు. రెగ్యులర్ ఫైలు పరిశీలన, నిర్ణయాలు తీసుకునే స్థాయిలో అధికారాలు లేనందున, వారు తహసీల్దార్ స్థానాన్ని పూర్తిగా భర్తీ చేయలేరు.

**తహసీల్దార్ ఆఫీసుల పరిపాలన స్తబ్దత:**
స్థానిక అధికారుల సహకారంతో ప్రజలు చిన్న చిన్న పనుల కోసం కోర్టులను లేదా జిల్లా కార్యాలయాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి.

**అక్రమ నిర్మాణాలకు ప్రోత్సాహం:**
రెగ్యులర్ మానిటరింగ్ లేకపోవడంతో, కొంతమంది భూ దందాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**రెవెన్యూ సేవల్లో జాప్యం :**
పట్టాదారు పాస్‌బుక్‌లు, ఆదాయ, రేషన్, కుల, నివాస సర్టిఫికెట్లు వంటి సేవలు జాప్యం అవుతున్నాయి. రైతులకు అవసరమైన భూముల రికార్డుల అప్డేట్లు కూడా ఆలస్యం అవుతున్నాయి. డబ్బుతో సంబంధమున్న ప్రభుత్వ పథకాల అందడం లేదు.

**ఫైళ్ల క్లియరెన్స్ నిలిచిపోవడం :**
తహసీల్దార్ అధికారికంగా అనుమతులు ఇచ్చే స్థాయి అధికారి కావడంతో, అనేక కేసుల పరిష్కారం నిలిచిపోతోంది. భూ పంపిణీ, వారసత్వ భూముల హస్తాంతరణ వంటి కీలక నిర్ణయాలు నిలిచిపోతున్నాయి.

**భూ కబ్జాలకు అవకాశం :**
తహసీల్దార్ లేని పరిస్థితిని కొందరు దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వ భూములు ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారు. రెగ్యులర్ మానిటరింగ్ లేకపోవడంతో అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నాయి.

**పరిష్కారాధికారి లేకపోవడం :**
తహసీల్దార్ ఆఫీసు ప్రజలకు "ఫస్ట్ లెవల్ అఫిషియల్" గా వ్యవహరిస్తుంది. స్థానికంగా తగాదాలు, వివాదాల పరిష్కారానికి తహసీల్దార్ అవసరం. ఆయన లేకపోతే, కేసులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండిపోతాయి.

**ప్రభుత్వ పథకాలు నిలిచిపోవడం :**
రేషన్ కార్డులు, డబుల్ బెడ్ రూమ్ లాంటి సంక్షేమ పథకాల అమలులో తహసీల్దార్ పాత్ర కీలకం. ఆయన లేకపోవడం వల్ల అనేక మంది లబ్ధిదారులు చేర్చబడకుండా, నష్టపోతున్నారు. ప్రజల నిరాశ, అధికార వ్యవస్థపై నమ్మకం తగ్గిపోవడం సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ ఆఫీసును ఆశ్రయించే ప్రజలు తిరిగి తిరిగి అలసిపోతున్నారు. ఫలితంగా ప్రజలు ప్రభుత్వంపై నమ్మకాన్ని కోల్పోతున్నారు. తహసీల్దార్ పోస్టులు ఖాళీగా ఉండటం లఘుదృష్టితో చూడవలసిన విషయం కాదు. ఇది ఒక మండల పరిపాలనని ఇంజిన్ లేకుండా రైలును నడిపే ప్రయత్నం లాంటిది. తక్షణమే ఖాళీలను భర్తీ చేయాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే పౌర సేవల తలకిందులవడం తప్పదు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ స్థాయిలో సమీక్ష జరిపి, తహసీల్దార్ల లేకుండా ఉన్న మండలాల్లో తక్షణ నియామకాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే భవిష్యత్‌లో రెవెన్యూ వ్యవస్థ మీద ప్రజల్లో నమ్మకం తగ్గిపోవడం ఖాయం.





## అన్ని మున్సిపాలిటీల్లోనూ స్వీపింగ్ మిషన్స్!

**టీపీఎన్, నెల్లూరు :**

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో స్వీపింగ్ మిషన్స్‌త్వరలో అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. శుక్రవారం ఉదయం 7వ డివిజన్ స్టోన్ హౌస్ పేటలో రోడ్లను శుభ్రపరిచేందుకు స్వీపింగ్ మిషన్ వాహనాలను మంత్రి నారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నెల్లూరు నగర అభివృద్ధే లక్ష్యంగా అనేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. రూ.1.10 కోట్లు విలువ కలిగిన స్వీపింగ్ మిషన్ వాహనాన్ని నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా అందజేశామన్నారు. కార్పొరేషన్ లో స్వీపింగ్ మిషన్ వాహనాల సంఖ్య 28 చేరినట్లు మంత్రి చెప్పారు. ప్రధాన వీధుల్లో మాన్యువల్ స్వీపింగ్ కి స్వస్తి పలికి రోడ్ల శుభ్రతను మెరుగుపరిచేందుకు మిషన్ స్వీపింగ్ పై దృష్టిపెట్టినట్టు మంత్రి చెప్పారు. క్లీనింగ్ మిషన్ల ద్వారా 49 రోజుల్లో నెల్లూరులో దుమ్ము లేకుండా చేస్తామని చెప్పారు. అవసరాన్ని బట్టి విడతల వారీగా స్వీపింగ్ మిషన్ వాహనాల సంఖ్యను పెంచుతామన్నారు. అనంతరం బీవీఎస్ మున్సిపల్ హై స్కూల్ ని పరిశీలించిన మంత్రి, అదనపు తరగతి గదుల నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నందన్, హెల్త్ ఆఫీసర్ చైతన్య, మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పంటపొలాలకు చెరువుల్లో మట్టిని తీసుకెళ్లొచ్చు!

- రైతులకు మంత్రి సవిత భరోసా
- ట్రాక్టర్ రూ.3లు చెల్లిస్తే చాలు
- అధికారులెవరూ అడ్డుకోరు...
- రూ.59 కోట్లతో పెనుకొండలోని 26 చెరువుల అభివృద్ధి
- రూ.3.50 కోట్లతో కాలువల్లో జంగిల్ క్లియిరెన్స్
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- కూటమి నాయకులకు, కార్యకర్తలకు మంత్రి సవిత పిలుపు

**టీపీఎన్, పెనుకొండ :**

ఎరువు కోసం పంట పొలాలకు చెరువులోని మట్టిని తరలించుకోవొచ్చునని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత. జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గానికి చెందిన ఐదు మండలాల సాగునీటి సంఘ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, అధికారులతో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి సవిత మాట్లాదారు . ట్రాక్టర్ కు కేవలం రూ.3లు మాత్రమే చెల్లించి చెరువు మట్టిని తవ్వుకోవొచ్చునని తెలిపారు. నియోజక వర్గంలోని సాగునీటి కాలువల్లో జంగిల్ క్లియిరెన్స్, మట్టి తవ్వకాలకు రూ.3.50 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రూ.50 కోట్లతో నియోజక వర్గంలో ఉన్న 26 చెరువులను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. రైతు సంక్షేమానికి సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. రాయలసీమలో సాగు, తాగునీరు అందించిన ఘనత కూడా టీడీపీ ప్రభుత్వాలేనన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా డ్రిప్ ఇరిగేషన్ ను ప్రారంభించన ఘనత సీఎం చంద్రబాబునాయుడిదేనన్నారు. పంట పొలాలకు ఎరువుగా చెరువుల్లోని మట్టిని తీసుకెళ్లొచ్చునని, ఎవరూ దీన్ని అడ్డుకోరని మంత్రి సవిత స్పష్టంచేశారు. ట్రాక్టర్ కు కేవలం రూ.3లు మాత్రమే చెల్లించి చెరువులో మట్టిని తవ్వుకోవొచ్చునన్నారు.



**జంగిల్ క్లియిరెన్స్ కు రూ.3.50 కోట్లు**
నియోజక వర్గంలోని పంట కాలువల్లో జంగిల్ క్లియిరెన్స్ కు కూటమి ప్రభుత్వం రూ.3.50 కోట్లు ఇవ్వడానికి అంగీకరించిందని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా రూ.50 లక్షలు ఇప్పటికే మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో పంట కాలువల్లో జంగిల్ క్లియిరెన్స్ తోపాటు నీరు సాఫీగా ప్రవహించేలా మట్టి కూడా తొలగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నిధుల వినియోగానికి జీఎస్టీకి సంబంధించి సమస్య తలెత్తిందని, కొద్ది రోజుల్లోనే సమస్య పరిష్కారమై పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

**రూ.50 కోట్లతో చెరువు అభివృద్ధి**
ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో ప్రతి నీటి బొట్టునూ రైతులకు అందజేయాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా పెనుకొండ నియోజక వర్గంలో 26 చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.50 కోట్లు ఇవ్వనుందన్నారు. ఈ నిధులతో చెరువులతో పాటు రిజర్వాయర్ల నుంచి చెరువులకు నీరందించే కాలువులను సైతం అభివృద్ధి చేయనున్నామన్నారు.

**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి**
కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో ఎన్నో సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని మంత్రి సవిత తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా పెన్షన్లు పెంచామని, ఒకటో తేదీనే అందజేస్తున్నామని తెలిపారు. అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని, ఉచిత ఇసుక, మహిళలకు ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామని తెలిపారు. జగన్ తీసుకొచ్చిన చీకటి చట్టం ల్యాండ్ యాక్టును రద్దు చేశామన్నారు. పల్లె పండగ పేరుతో గ్రామాల్లో రహదారులు నిర్మిస్తున్నామన్నారు. ఇంటిలో ఎందరు చదువుకున్న పిల్లలుంటే వారందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేశామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని కొద్ది రోజుల్లో అందజేయనున్నామన్నారు. లక్ష కోట్ల రూపాయలతో రాష్ట్రానికి నూతన పరిశ్రమలు తీసుకొస్తున్నామన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చుతున్నారన్నారు. ఈ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి టీడీపీ కార్యకర్తపైనా, నాయకుడిపైనా ఉందన్నారు. వచ్చే నెల రెండో తేదీ నుంచి చేపట్టనున్న ఇంటింటికీ మంచి ప్రభుత్వం కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులతో పాటు కూటమిలోని ఇతర నాయకులు కూడా తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులతో పాటు ఐదు మండలాల సాగునీటి సంఘ అధ్యక్షులు, ఉపాధ్యాక్షులు, అధికారులు పాల్గొన్నారు.

# సింగయ్య మృతి కేసు.. జగన్ వాహనం చెకింగ్..!

**టీపీఎన్, అమరావతి :**



పల్నాడు జిల్లా రెంటపాళ్లలో వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనలో సింగయ్య అనే వృద్ధుడు మాజీ సీఎం కారు కింద నలిగి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా జగన్ రెడ్డి వాహనాన్ని రవాణా శాఖ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. సింగయ్య మృతిపై ఇప్పటికే నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఈ క్రమంలో జగన్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు జిల్లా పోలీసు కార్యాలయంలో ఉంచారు. ఈ క్రమంలో నేడు ఏపీ 40 డీహెచ్ 2349 వాహనం ఫిట్ నెస్‌ను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. ఎంవీఐ గంగాధర ప్రసాద్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు జరిగాయి. కాగా.. ఇటీవల రెంటపాళ్ల పర్యటనకు జగన్ వచ్చిన సందర్భంగా గుంటూరు ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన ప్రమాదంలో వైసీపీ అధినేత కారు కింద పడి సింగయ్య అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై గుంటూరు నల్లపాటు పీఎస్‌లో కేసు నమోదు అవగా.. ఏ1గా డ్రైవర్ రమణారెడ్డి, ఏ2గా జగన్ మోహన్ రెడ్డి, వైసీపీకి చెందిన సుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, విడుదల రజినీ, పేర్ని నాని పేర్లు చేర్చారు.కేసు నమోదు అనంతరం నల్లపాడు పోలీసులు సింగయ్య మృతికి కారణమైన జగన్ ప్రయాణించిన కారును తాడేపల్లికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఆ కారును గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉంచారు. శుక్రవారం గుంటూరుకు చెందిన రవాణా శాఖ అధికారులు.. జగన్ కారు ఫిట్‌నెస్‌ను చెక్ చేశారు. ఆర్టీవోకు చెందిన మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఓ టీం గుంటూరు ఎస్పీ కార్యాలయానికి వచ్చి జగన్ వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనం ఫిట్‌గా ఉన్నట్లు రవాణా శాఖ అధికారులు నిర్ధారణకు వచ్చారు.అయితే జగన్ వాహనం విషయంలో గుంటూరు ఎస్పీ రెండు రకాల ప్రకటనలు చేసిన విషయం తెలిసిందే. తొలుత జగన్ పర్యటన రోజు 0001 సఫారీ వాహనం ఢీకొని సింగయ్య మృతిచెందారని ప్రకటించారు. నాలుగు రోజుల తర్వాత జగన్ కారు కిందే పడి సింగయ్య మృతి చెందిన వీడియో బయటకు రావడంతో గుంటూరు ఎస్పీ మరోసారి మీడియా సమావేశం ఏర్పాటు చేసి జగన్ వాహనం కింద పడే సింగయ్య మృతి చెందినట్లు చెప్పారు. అలాగే ఈ ప్రమాదానికి సంబంధించి డ్రైవర్ రమణారెడ్డి, జగన్‌తో పాటు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. దీనిపై గుంటూరు జిల్లా పోలీసులపై కూడా అనేక విమర్శలు వచ్చిన నేపథ్యంలో.. తదుపరి విచారణలో ఎలాంటి తప్పిదాలు జరుగకుండా చూడాలని గుంటూరు పోలీసులు భావిస్తున్నారు.

**జగన్‌కు స్వల్ప ఊరట**

మరోవైపు ఏపీ హైకోర్టులో మాజీ సీఎం జగన్‌కు స్వల్ప ఊరట లభించింది. సింగయ్య మృతి ఘటనలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని హైకోర్ట్‌లో జగన్ క్వాష్ పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం హైకోర్టులో విచారణకు జరగగా.. జగన్ తరపున న్యాయవాదులు వాదనలు వినిపించారు. అయితే కేసు విచారణను జూలై 1కి కోర్టు వాయిదా వేసింది. అప్పటి వరకు ఎటువంటి తొందర పాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.



# కమిషనర్ పనిచేయకపోవడం వల్లే..

- **పోలీసులు కౌన్సిలర్లను బట్టలిప్పి నిలబెట్టారు..!**
- **టీడీపీ జెండాల తొలగింపు కేసులో అరెస్ట్‌పై పులివెందుల కౌన్సిలర్ల ఆవేదన**
- **పోలీసులు దారుణంగా ప్రవర్తించారని ఆరోపణ**
- **కమిషనర్‌ను ఎందుకు ప్రభుత్వానికి సరెండర్ చేయకూడదని డిమాండ్**
- **కౌన్సిల్ సమావేశంలో చైర్మన్, కౌన్సిలర్లు**

**టీపీఎన్, కడప :**

మహానాడు సందర్భంగా టీడీపీ నాయకులు పులివెందుల పట్టణంలోని కూడళ్లలో వైఎస్సార్ విగ్రహం చుట్టు విగ్రహాలు కనిపించకుండా కట్టిన జెండాలను తీయించవలసిందిగా కమిషనర్‌తోపాటు పోలీసులకు కూడా తెలియజేశామని... అయితే వారు స్పందించకపోవడం వల్ల అనేక సమస్యలు చోటుచేసుకున్నయని పులివెందుల మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందుల మున్సిపాలిటీలోని కౌన్సిల్ సమావేశాన్ని శుక్రవారం అత్యవసరంగా మున్సిపల్ చైర్మన్ వలెపు వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ కేవలం జెం డాలు తీయమన్నందుకు అధికారులు స్పందించకపోవడం వల్లనే వైసీపీ కార్యకర్తలు వెళ్లి ఆ జెండాలను తీసివేశారన్నారు. పులివెందుల మున్సిపల్ చైర్మన్ తో పాటు కౌన్సిలర్లు వైఎస్ఆర్సిపి కార్యకర్తల అటెంప్ట్ మర్డర్ కేసులను నమోదు చేసి అత్యంత దారుణంగా హింసించారన్నారు. మున్సిపల్ " కౌన్సిలర్లను గౌరవప్రదంగా చూడవలసింది పోయి పోలీసులు బట్టలు విప్పి మరి నిలబెట్టారన్నారు. అత్యంత దారుణంగా ప్రవర్తించి కౌన్సిలర్లను చితక బాదారని, ఈ విషయాన్ని కోర్టు ముందు కూడా తెలియజేశామన్నారు. మున్సిపల్ కమిషనర్ తో పాటు టౌన్ ప్లానింగ్ అధికారి కూడా సరిగా పనిచేయకపోడం వల్లనే ఈ సమస్యలన్నీ వచ్చాయని ఆయన పేర్కొన్నారు కమిషనర్ తన పని సక్రమంగా చేయనందుకు ఎందుకు తనను ప్రభుత్వానికి సరెండర్ చేయకూడదు చెప్పాలని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాముడు స్పందిస్తూ ముందుగా సభ తనను క్షమించాలని, మహానాడు సందర్భంగా తనకు ఉ న్నతాధికారులు విధులు నిర్వహించేందుకు వెళ్ళమని చెప్పారని, అందువల్ల మహానాడు కార్యక్రమంలో ఉన్నందువల్ల తాను తన క్రింది స్థాయి అధికారులకు వీటిని తీయించవలసిందిగా తెలియజేశానన్నారు. అయితే వారు వీటిని తీయించేందుకు కోసం పోలీస్ అధికారులను సంప్రదించారని అయితే పోలీస్ మహానాడులో ఉన్నందువల్ల పోలీసులు వారికి స్పందించలేదని, అందువల్లని ఆ జెండాలను తీయించలేకపోయమన్నారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ వైస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిలర్ల పై టిడిపి నాయకులు కేసులను బనాయించడం చాలా దారుణమైన విషయమన్నారు. కేవలం కౌన్సిలర్లని కాకుండా ఎనిమిది, పది తరగతుల చదివే విద్యార్థులపై కూడా అటెంప్ట్ మర్డర్ కేసులను పెట్టడం చాలా దారుణమైన విషయమన్నారు. కౌన్సిలర్లు, చిన్నారుల వద్ద ఎటువంటి మారణాయుధాలు లేకున్నప్పటికీ కూడా వారిపై అటెంప్ట్ మర్డర్ కేసులను పోలీసులు నమోదు చేశారని, ఈ కౌన్సిల్ ఈ సంఘటనపై తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపిస్తుందన్నారు. అలాగే దీనిపై మానవ హక్కుల కమిషన్‌తోపాటు ఎస్సీఎస్టీ కౌన్సిల్‌కు కూడా వెళ్తామని చైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నజీర్ అహ్మద్, కమిషనర్ రాముడు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.




# చంద్రబాబు పాలనలో ధన ఉన్మాదం రాజ్యమేలుతోంది..!

- **వైసీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం సంచలన వ్యాఖ్యలు**

**టీసీఎన్, రాయచోటి :**

చంద్రబాబు పాలనలో ధన ఉన్మాదం రాజ్యమేలుతోందని జెడ్పీ మాజీ చైర్మన్, ఇటీవల టీడీపీని వీడి వైసీపీలో చేరిన రాజంపేట టీడీపీ ఎంఎల్ఏ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలు జరగడం లేదని, కూటమి పార్టీల్లోని 164 శాసన సభ్యులలో ఎవరైనా కాణిపాకంలో ప్రమాణం చేస్తారా అని సవాల్ విసిరారు. అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని నేను ప్రమాణం చేయడానికి సిద్ధంగా వున్నానని, ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పినవి ఒకటి, అధికారంలోకివచ్చిన తరువాత ఇంకొకటి చేస్తున్నారని మండిపడ్డారు. టి డి పి అధికారంలోకి వచ్చి వంద రోజులు అయిన తరువాత వంద రోజుల పాలన కార్యక్రమంలో తాను పాల్గొన్నానని, ప్రభుత్వంలో జరుగుతున్న తప్పులను , లంచగొండితనం ఎక్కువ అయినట్లు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లితే నన్నే పక్కకు దొబ్బారన్నారు. జగన్ హయాంలో ముందుచూపుతో చేసిన పథకాలనే కూటమి ప్రభుత్వం అమలు చేస్తుండడం చూస్తుంటే జగన్ ముందుచూపు ఏంటో ఆర్తమవుతొందన్నారు. చంద్రబాబు పాలనలో జరుగుతున్న అన్యాలపైన ప్రజాలను మేలుకొల్పాలని, మీలో ఒక్కడిగా, తోడుగా ఉండి వైసీపీ విజయానికి కృషి చేస్తానని బాలసుబ్రమణ్యం చెప్పారు.

# బాబు మోసాల్ని గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కించొచ్చు : సజ్జల





**టీపీఎన్, శింగనమల :**

ప్రజలకు ఎన్నికల వేళ హామీలను ఎంత తేలికగా ఇచ్చారో.. వాటిని అంతే తేలికగా ఇప్పుడు చంద్రబాబు కొట్టేస్తున్నారని వైఎస్సార్‌సీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. ఏడాదిలోనే ప్రజావ్యతిరేకతను కూటమి ప్రభుత్వం మూట కట్టుకుందని.. అందుకే బాబు మెడలు వంచడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారాయన. అశేష ప్రజాదరణ ఉన్న వైఎస్ జగన్‌పై సర్కార్ ఎన్ని కుట్రలు చేసినా ప్రయోజనం ఉండదని తేల్చేశారాయన. అబద్ధాలను ప్రచారం చేయడంలో సీఎం చంద్రబాబును మించినవారు లేరన్నారు. శింగనమల నియోజకవర్గంలో పార్టీ కార్యాలయం ప్రారంభించిన అనంతరం.. రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "చంద్రబాబు మోసాలను గుర్తుచేసేందుకే ఈ కార్యక్రమం. సంపద సృష్టిస్తానన్న చంద్రబాబు... ఇప్పుడు సంపద ఎలా సృష్టించాలో, సూపర్ సిక్స్ హామీలు ఎలా అమలు చేయాలో చెవిలో చెప్పాలంటున్నారు!. హామీలను తేలికగా ఇచ్చినట్లే.. అంతే తేలికగా కొట్టిపారేస్తుంటారాయన. అందుకే ఏడాది కాలంలోనే చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని పూర్తి స్థాయిలో నిర్వీర్యం చేయాలన్న కుట్రలతో చంద్రబాబు సర్కార్ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. వైఎస్సార్‌సీపీ నేతలను, కార్యకర్తలందరినీ జైల్లో పెట్టాలన్నది చంద్రబాబు కోరిక. వైఎస్సార్ సీపీ నేతలపై దాడులు చేసి.. బాధితులపైనే హత్యాయత్నం కేసులు నమోదు చేస్తున్నారు. కానీ వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా.. చంద్రబాబుపై అక్రమ కేసులు నమోదు చేయలేదు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అన్ని ఆధారాలతోనే చంద్రబాబుపై కేసు నమోదు చేశాం. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేసిన మంచి చాలా ఉండేది. చంద్రబాబు దుర్మార్గాలను చెబుతూ పోతే వారం రోజులు పడుతుంది. చంద్రబాబు మోసాలు, దుర్మార్గాలను గిన్నిస్ బుక్‌లోకి ఎక్కించొచ్చు. అబద్ధాలను ప్రచారంలో చంద్రబాబును మించినవారు లేరు. రాష్ట్రంలో మట్టి, ఇసుకను ఎల్లో మాఫియా మింగేస్తోంది. కూటమి నేతలు ఇళ్లకు వస్తే నిలదీయడానికి.. చంద్రబాబు మెడలు వంచడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారు. మన దేశంలో రీకాల్ సిస్టం లేదు.. లేకపోతే చంద్రబాబు సర్కార్‌కు పదవీ గండం ఉండేది. హామీలపై ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు నమోదు చేయడం దుర్మార్గం. గడికోట శ్రీకాంత్ రెడ్డిపై ఎస్వోజీ యాక్ట్ కింద కేసు నమోదు చేయడం దారుణం. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యక్తిత్వ హననం చేసేందుకు, ఆయన్ని లేకుండా చేసేందుకు టీడీపీ కుట్రలు చేస్తోంది. ఆయనకు ఉన్న భద్రతను తొలగించింది. పేరుకే జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత.. ఆచరణలో అమలు చేయడం లేదు. సింగయ్య మృతి కేసులో జగన్‌పై కేసు నమోదు.. దుర్మార్గానికి పరాకాష్ట. ఎన్ని బెదిరింపులు వచ్చినా సత్తెనపల్లిలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని చూసేందుకు జనం పోటెత్తారు. వైఎస్ జగన్‌ను ఎంత అణచివేయాలని చూస్తే... అంత ఎదుగుతారు. మంచి పనులు చేస్తే జనం ఆదరిస్తారన్న విషయాన్ని చంద్రబాబు గ్రహించాలి. వైఎస్ జగన్‌కు మద్దతుగా లక్షల మంది ఉన్నారు. వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వస్తే కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని" సజ్జల చెప్పారు.



# బద్వేల్‌లో కూల్చివేతల కలకలం..!

**టీపీఎన్, కడప :**

బద్వేల్ నియోజకవర్గంలో కూల్చివేతలు కలకలం రేపుతున్నాయి. బద్వేలు మండలం బయనపల్లెలో వైసీపీ నేత శ్రీకాంత్‌రెడ్డి ఫామ్ హౌస్‌ను శుక్రవారం తెల్లవారుజామున కూల్చివేశారు అధికారులు. అంతకుముందు బద్వేలు మండలం బయనపల్లెలో గురువారం సాయంత్రం అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బయనపల్లె చెరువు తొట్టులో శ్రీకాంత్‌రెడ్డి ఇంటిని నిర్మించుకున్నారు. ఆ ఇల్లు అక్రమ కట్టడం అంటూని తొలగించేందుకు ఇరిగేషన్ ఇన్‌ఛార్జి డీఈఈ వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు, పోలీసులు, రెండు జేసీబీలతో బయనపల్లె వెళ్లారు. ఈ విషయంలో తెలుసుకున్న వైసీపీ శ్రేణులు అక్కడకు భారీ ఎత్తున చేరుకున్నారు. తొలగింపును అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, పురపాలక ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైసీపీ నాయకుడు గురుమోహన్ రాత్రి అక్కడికి చేరుకున్నారు. బద్వేలు పురపాలకలోని ఆక్రమణలన్నీ తొలగించాలని.. అప్పుడు తాము కూడా స్వచ్ఛందంగా తొలగిస్తామంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో చేసేదేమీ లేక అధికారులు రాత్రి పది గంటల సమయంలో అక్కడి నుంచి వెనుదిరిగారు. తిరిగి శుక్రవారం తెల్లవారుజామున అధికారులు ఎట్టకేలకు శ్రీకాంత్‌రెడ్డి ఫామ్ హౌస్‌ను కూల్చివేశారు. పార్టీ మారలేదన్న కక్షతోనే టీడీపీ నేతలు కక్షసాధింపుదోరణిలో తన ఫామ్ హౌస్‌ను కూల్చివేశారని ఆరోపించారు శ్రీకాంత్‌రెడ్డి. తన ఇంటిని కూల్చివేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. 60ఏళ్లుగా తమ వంశ పారపర్యంగా వచ్చిన స్థలంలోనే గత ఏమిదేళ్ల క్రితం.. గత టీడీపీ గవర్నమెంట్‌లోనే తాను ఇల్లుకట్టుకున్నానని చెప్పారు. టీడీపీ గవర్నమెంట్‌లోనే రోడ్డు కూడా వేశారని చెప్పారు. తన ఇంటికి సమీపంలో సుమారు 500 ఇళ్లు కడితే వాటిపై ఎలాంటి యాక్షన్ తీసుకోకుండా కేవలం తన ఇంటిని మాత్రమే కూల్చివేశారన్నారు. ఇప్పటికైనా కక్షసాధింపు దోరణి మానుకోవాలని హెచ్చరించారు. తాను టీడీపీ నేతలు చేసే అక్రమాలపై పోరాడుతూనే ఉంటానని తెలిపారు. తనపై ఎలాంటి దాడులు చేసిన తాను మాత్రం వైసీపీ, జగన్‌ను వీడే ప్రసక్తే లేదన్నారు.




# కల్లుగీత కార్మికులు జోలికి వస్తే ఊరుకోం : మంత్రి సుభాష్

**టీపీఎన్, తుని :**

కల్లుగీత కార్మికుల జోలికి ఎవరైనా వస్తే చూస్తూ ఊరుకోమని రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. శుక్రవారం తుని అమ్మాజీ పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన శెట్టిబలిజ సామాజిక సంఘ సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు అనంతరం తుని పట్టణంలో చేపట్టిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు సాయి వేదిక వద్ద ఏర్పాటుచేసిన సామాజిక వర్గ సమావేశానికి తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడితో కలిసి హాజరయ్యారు యనమలతో కలిసి జ్యోతి ప్రజలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు కల్లుగీత కార్మికుల పై పీడీ యాక్ట్ లు పెడుతున్నారని కొంతమంది పెద్దలు చేసిన విన్నపానికి ఆయన స్పందించారు కల్లు గీత కార్మికుల జోలికి ఎవరైనా వస్తే చూస్తూ ఊరుకోమంటూ హెచ్చరించారు అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్న వారిపై తప్ప తమ సామాజిక వర్గంపై తప్పుడు కేసులు బనాయిస్తే కచ్చితంగా నిలదీస్తామన్నారు తనపై ముఖ్యంగా మూడు బాధ్యతలు ఉన్నాయని మంత్రిగా పార్టీకి కట్టుబడి పని చేయాలని అదే విధంగా నియోజకవర్గ ప్రజల అభివృద్ధి సంక్షేమానికి పాటుపడాలని అదే సమయంలో సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు ప్రస్తుతం రాష్ట్రంలో కులం ఆధారంగా రాజకీయాలు జరుగుతున్నాయన్నారు తుని పట్టణంలోని శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన నాయకులు అభిమానులు చూపించిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు గత ప్రభుత్వంలో తమ సామాజిక వర్గం పై పెట్టిన అక్రమ కేసులను ఖండిస్తూ భారీ స్థాయిలో వనభోజనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఏకగ్రీవంగా ఖండించడం జరిగింది అన్నారు లక్షల సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో జగన్ ప్రభుత్వం దిగిరాక తప్పలేదు అన్నారు బీసీ కార్పొరేషన్ ల నిధులను గత ప్రభుత్వం ఏ ఒక్కరికి కేటాయించలేదంటూ విమర్శించారు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ సామాజిక వర్గానికి ప్రత్యేక ప్రాధాన్యతను కల్పించడం జరిగిందన్నారు నిరుద్యోగ యువత స్థానిక నాయకులు ద్వారా తనను సంప్రదిస్తే ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాలు ఇప్పించేందుకు ప్రయత్నిస్తాను అన్నారు విద్య వైద్యం వంటి అంశాలపై ప్రభుత్వపరమైన సహకారాన్ని అందజేస్తామన్నారు సోషల్ మీడియాలో తనపై వస్తున్న అసత్య ప్రచారాన్ని ఖండించారు తుని నియోజకవర్గం లో గీత కార్మికులకు కేటాయించిన వైన్ షాపులను వారికే కేటాయించేలా చర్యలు చేపట్టి యనమల తమ సామాజిక వర్గానికి ఎంతో సహాయం చేశారన్నారు యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ బీసీలందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు 1984 ముందు ఈ పరిస్థితి లేదన్నారు కులాలకు ఉండే సమస్యలు వేరు బీసీ సంఘాలకు ఉండే సమస్యలు వేరు అని వివరించారు స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత కూడా తెలుగుదేశం ప్రభుత్వానికి చెందుతుందన్నారు సామాజిక వర్గ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేస్తే అధిష్టానానికి మంత్రి సుభాష్‌తో కలిసి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను వివరిస్తూ బీసీల కుల గణన రాష్ట్రంలోనూ దేశంలోనూ జరగాలని మేనిఫెస్టోలో పెట్టడం జరిగింది అన్నారు తద్వారా వారికి సంక్షేమ కార్యక్రమాలను అందించడంతోపాటుగా స్థానిక సంస్థలు చట్టసభలలో రిజర్వేషన్ కల్పించే విధంగా తీర్మానం చేయడం జరిగింది అన్నారు రాజమండ్రి కి చెందిన శెట్టిబలిజ సంఘం నాయకుడు పాలిక శ్రీను తుని పట్టణానికి చెందిన పాలికి శ్రీను సూరంపూడి చంద్రశేఖర్ వాసంశెట్టి శ్రీను సిహెచ్ వెంకటేశ్వర రావు తుని మున్సిపల్ ఛైర్ పర్సన్ నార్ల భవన సుందరి పట్టణ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు తోలెం ప్రసాద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ఎంపీపీ సుదర్శన్ రెడ్డి అరెస్ట్ రాజ్యాంగ విరుద్ధం!

**టీపీఎన్, అనంతపురం :**

ఎంపీపీ సుదర్శన్‌రెడ్డిని అరెస్ట్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని వైసీపీ నేత రవీంద్రా రెడ్డి మండిపడ్డారు. "గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆనాడు వైసీపీలో ఉన్న లోకేష్ అనే యువకుడు ప్రచార నిమిత్తం తన గ్రామానికి వెళ్లినప్పుడు స్వాగతం పలకడంలో భాగంగా అతనే స్వయంగా బాణసంచా కాల్చాడు. ఆ క్రమంలో అతనికి కంటి వద్ద గాయమైంది. వెంటనే ఆనాడే వైసీపీ నాయకులు మూడు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం కూడా చేశారు. సంఘటన జరిగిన 14 నెలల తర్వాత నేడు తాను పేల్చిన బాణసంచా కారణంగా గాయమైతే, వైఎస్సార్సీపీ నాయకులు డిటొనేటర్లు పేల్చి గాయపరిచినట్లు సదరు లోకేష్‌ను టీడీపీలో చేర్చుకొని, కుట్రపూరితంగా అతనితో మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయించడం జరిగింది, సదరు మానవ హక్కుల కమిషన్ ఆదేశాల మేరకు పేలుడు పదార్థాల సెక్షన్ 326, 420 కింద కేసు నమోదు చేయడం, ఆ సందర్భంలో అక్కడ లేనటువంటి రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పేరు కూడా చేర్చడంతో పాటు రమేష్ రెడ్డి, ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డితో సహా 19 మందిపై కేసులు పెట్టడం రాజ్యాంగ విరుద్ధం. ఇది పూర్తిగా ప్రభుత్వానికి దగ్గర్లో ఉన్న కొంతమంది వ్యక్తుల ప్రయోజనాలు నెరవేర్చడం కోసం అధికారిక యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడమే. ఇలా చేయడం బట్టి నేడు రాష్ట్రంలో ఎమర్జెన్సీ నాటికంటే దుర్మార్గమైన పరిస్థితులు కొనసాగుతున్నాయని తెలుస్తోంది. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగమే సుప్రీమ్. శాసన, కార్యనిర్వాహక, న్యాయ విభాగాలు మూడు రాజ్యాంగానికి లోబడే పనిచేయాలి. రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మార్చే అధికారం ఎవరికి లేదు. కావున ఇది ముమ్మాటికి పౌర హక్కులకు భంగం కలిగించడమే. అందుకే నేడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని పక్కన పెట్టేసి తాము రచించుకున్న రెడ్ బుక్ రాజ్యాంగం ప్రకారం పాలన సాగిస్తూ, కక్షపూరితంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నది. ఈ ప్రభుత్వం పాలన చేసే అర్హత కోల్పోయింది. వెంటనే గవర్నర్ ,రాష్ట్రపతి కలుగ చేసుకుని కక్షపూరిత, భారత రాజ్యాంగ వ్యతిరేక పాలనను సాగిస్తున్న ఈ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి" అని డిమాండ్ చేశారు.

# వైసీపీ పోరాటాలు చేస్తే తప్ప హామీలు అమలు చెయ్యడం లేదు..!

- **వైసీపీ రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి**
- **లంచాల కోసం అమరావతికి లక్ష కోట్లు ఖర్చు పెడుతున్నారు..!**

**టీపీఎన్, రాయచోటి :**

మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన పథకాల పేర్లు మార్చి ఇంకా సిక్స్, సెవెన్ అంటూ మరిన్ని మంచి చేస్తానని ప్రజలను చంద్రబాబు మభ్య పెట్టారని, నేడు సూపర్ సిక్స్ అమలు చేసేశా.. దాని గురించి మాట్లాడితే నాలుకా తెగ్గోస్తానని చెప్పడం దారుణమని వైసీపీ రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి మండిపడ్డారు. రాయచోటిలోని వైసీపీ జిల్లా కార్యాలయం ఆవరణలో జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. వైసీపీ పోరాటాలు చేస్తే తప్ప హామీలు అమలు చెయ్యడం లేదని, వైసీపీ పోరాటాల వల్లే తల్లికి వందనం ఇచ్చారన్నారు. ఇచ్చినా 30 శాతం కూడా లబ్ధిదారులకు అందలేదని, మహిళలకు ఉచిత గ్యాస్ అన్నారని, ఎంతమందికి ఇచ్చారో చెప్పాలని, తూతూమంత్రంగా ఇచ్చి అన్ని చేసేశాం అంటున్నారన్నారు. నిరుద్యోగ యువతకు 36000, మహిళలకు 18000 అప్పు పెట్టాడని, 20 లక్షల మందికి ఉద్యోగాలని చెప్పి మూడు లక్షల ఉద్యోగాలు తొలగించారని, వాలంటీర్లు పూతరేకులు తీసుకుని ఎదురు చూస్తున్నారన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా జగన్మోహన్ రెడ్డి ఏమి చేశారు..? చంద్రబాబు ఏమి చేశారో తెలుసుకోవచ్చునని, జగన్మోహన్ రెడ్డి అమ్మ ఒడి ఒకరికి ఇచ్చారని.. మీ ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికి చంద్రబాబు ఇస్తానని ఎగనామం పెట్టారన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెన ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఉపాధి హామీ పనులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని, నియంత పాలన సాగిస్తున్న చంద్రబాబును గద్దె దింపడానికి ప్రజలు వేచి చూస్తున్నారన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు 99 శాతం అమలు చేస్తే చంద్రబాబు ఎల్లో మీడియాలో ఆయనపై అబాండాలు వేస్తున్నాయన్నారు. లంచాలు తీసుకొని లక్ష కోట్లు అమరావతి కోసం పెడుతున్నారని, అమరావతి, పోలవరం అని చెబుతూ రాయలసీమ, ఉత్తరాంధ్రను గాలికి వదిలేశారన్నారు. నారాయణ, చైతన్య విద్యా సంస్థలకు మేలు చేద్దామని జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఇంగ్లీష్ మీడియంను తొలగించారన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు అమర్నాథ్ రెడ్డి, ద్వారకనాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లి ఇన్చార్జ్ నిసార అహ్మద్, జెడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.










# సూళ్లూరుపేటలో భారీగా గంజాయి పట్టివేత!

**టీపీఎన్, సూళ్లూరుపేట :**

పట్టణంలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, నాయుడుపేట డివిజన్‌కి చెందిన డీఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో, గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు కీలక చర్యలు తీసుకున్నారు. సూళ్లూరుపేట సర్కిల్ ఆఫీస్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. పోలీసుల సమాచారం ప్రకారం, సూళ్లూరుపేట మండలం మన్నారు పోలూరు సమీపంలో, భారత్ పెట్రోల్ బంక్‌కు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం ఆధారంగా.. సూళ్లూరుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మ నాయుడు, తడ ఎస్ఐ కొండపనాయుడు, ఇతర సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మొత్తం ఐదుగురు ముద్దాయిలను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 3,50,000 విలువైన 20 కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.



# జిల్లాకు బాసటగా బిల్ గేట్స్ ఫౌండేషన్!

**టీపీఎన్, కడప :**

కడప జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజల పౌష్టికాహారం మెరుగుపరిచేందుకు ఐఎస్‌బి, బిల్ గేట్స్ ఫౌండేషన్స్ బాసటగా నిలుస్తున్నాయని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. ఎనాక్ట్స్ ప్రాజెక్ట్ (ఎనేబుల్ అగ్రికల్చర్ న్యూట్రిషన్ కన్వర్జెన్స్ త్రు టెక్నికల్ సపోర్ట్)లో భాగంగా భారతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ భాగస్వామ్యంతో జిల్లాలో పౌష్టికాహారం లోపం ఉన్న వారిని గుర్తించి పౌష్టికాహారం పెంపొందించడానికి కలెక్టర్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ జూమ్ సమావేశం నిర్వహించారు. జూమ్ సమావేశంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ఐఎస్‌బీ వారి ఆధ్వర్యంలో బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారంతో జిల్లాలోని పౌష్టికాహార లోపంతో ఉన్న మహిళలకు, పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్ అందించేందుకు ఎనాక్ట్స్ ప్రాజెక్ట్ ద్వారా జిల్లాలో మొదటగా చింతకొమ్మదిన్నె, జమ్మలమడుగు మండలాల్లో అమలుచేసి తర్వాత జిల్లా వ్యాప్తంగా అమలు చేసేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. గ్రామీణ కుటుంబాలకు పోషక ఆహారాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి పోషక అంశాలపై భారతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సహకారంతో జిల్లాలో అధ్యయనం చేయనున్నారని తెలిపారు. ఇందులో భాగంగా ఎనాక్ట్స్ ప్రాజెక్టులో సాంకేతిక మద్దతు ద్వారా పోషకార లోపం ఉన్న కుటుంబాలలోని మహిళలు, పిల్లలపై దృష్టిసారించి వారందరికీ పౌష్టికాహారం అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. పౌష్టికాహార, ప్రోటీన్ ఆహార పదార్థాలను కొనలేని స్థితిలో చాలామంది ప్రజలు ఉన్నారని.. వారందరికీ అందుబాటులో సరసమైన ధరల్లో పౌష్టికాహారం బహుళ రంగ మార్కెట్ల ద్వారా ప్రజలకు అందించడానికి ఈ సంస్థలు కృషి చేస్తున్నాయని తెలిపారు. జిల్లాలో పోషకాహార లోపాన్ని తగ్గించడం, వివిధ మార్కెట్ల ద్వారా న్యూట్రిషన్ ఫుడ్‌ను అందుబాటులోకి తీసుకురావడం వంటి వాటిపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. పోషకాహారాన్ని అందించడానికి డిజిటల్ ఈ వోచర్లను కూడా అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.



# తెలుగువారిని ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా నిలబెట్టడమే లక్ష్యం!

**టీపీఎన్, అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు, ఏపీఎన్ఆర్టీ సొసైటీ అధ్యక్షులుగా డా.వేమూరు రవికుమార్ పదవీ బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం తాడేపల్లిలోని సంస్థ కార్యాలయంలో పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వాళ్లు ఎక్కడున్నా నంబర్ వనhగా ఉండాలన్న సీఎం నారా చంద్రబాబు నాయుడు లక్ష్యానికి అనుగుణంగా, ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేష్ సూచనల మేరకు తాము పనిచేస్తామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ఎన్నారైలను రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములుగా చేస్తామని.. ఉద్యోగస్తులుగా ఉన్న ఎన్నారైలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తామన్నారు. దీంతో పాటు విదేశాల్లో ఉన్న మన విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చేలా మెరుగైన ప్రణాళికలు రూపొందించనున్నట్లు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రముఖ సంస్థల్లో అత్యున్నత స్థానాల్లో ఉన్న తెలుగు వారందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి మన విద్యార్థులకు ఉద్యోగావకాశాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఇందుకోసం మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం మేరకు స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ సహకారంతో అవసరమైన శిక్షణా కార్యక్రమాలను చేపట్టడంతో పాటు.. మన తెలుగు విద్యార్థులు విదేశాల్లో ఉగ్యోగాలు సాధించేలా ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. ఇందుకోసం వివిధ దేశాల్లోని మన రాష్ట్ర ప్రభుత్వ కోఆర్డినేటర్లతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తామని డా.వేమూరు రవి కుమార్ తెలిపారు.



# సీఆర్డీఏ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

**టీపీఎన్, అమరావతి :**

రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. పారిశుధ్య కార్మికుల వేతనాల పెంపు, రిటర్నబుల్ ప్లాట్లు, వీధిపోటు తదితర సమస్యల గురించి పలువురు రాజధాని ప్రాంతవాసులు తమ అర్జీలను "గ్రీవెన్స్ డే"లో ఏపీ సీఆర్డీఏ గ్రీవెన్స్ రీఅడ్రెస్సల్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి పి.జయశ్రీకి అందజేశారు. రైతులు, పారిశుధ్య కార్మికులు అందజేసిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని నోడల్ అధికారి అర్జీదారులకు తెలియజేశారు. సీఆర్డీఏలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై అర్జీదారులు తెలియజేసిన ఫిర్యాదులలో అధిక శాతం అక్కడికక్కడే పరిష్కారం చూపారు. తక్కినవి వెంటనే పరిష్కరించాలని నోడల్ అధికారి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. సమస్యలు పరిష్కరించటంలో అలసత్వం వద్దని సూచించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. గ్రీవెన్స్ డేలో 27 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదుల్లో అమరావతిలో భూమి వ్యవహారాలు 17, ప్లానింగ్ విభాగం 4, ఇన్‌ఫ్రా 1, సామాజిక సంక్షేమం కోసం 3 వచ్చాయన్నారు.



# జూలై 2న కుప్పంలో సీఎం పర్యటన.. ఏర్పాట్లపై అధికారుల సమీక్ష!

**టీపీఎన్, కుప్పం :**

జూలై 2న కుప్పంలో జరగనున్న సీఎం నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఐఏఎస్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో, డీఎస్పీ, జోన్ మేనేజర్APIIC చిత్తూరు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిందాల్ భూముల వివాదంపై కలెక్టర్ క్లారిటీ!

**టీపీఎన్, విజయనగరం :**

జిందాల్ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పారు. ఈ ప్రాంతం అభివృద్ధికి, యువతకు ఉద్యోగాల కల్పనకు ఈ పార్కు దోహదపడుతుందని, దీనికి ప్రతీఒక్కరూ సహకరించాలని కోరారు. జిందాల్ భూములకు సంబంధించి కేవలం 15 మంది రైతులకు మాత్రమే పరిహారం బకాయి ఉందని చెప్పారు. జిందాల్ పరిశ్రమ ఏర్పాటుకు అప్పట్లోనే సుమారు 1166 ఎకరాలను ప్రభుత్వం అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ భూముల్లో 180 ఎకరాలను జిందాల్ యాజమాన్యమే నేరుగా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిందని చెప్పారు. ఇది కాకుండా మొత్తం 375 మంది రైతులనుంచి 834 ఎకరాల అసైన్డ్ భూమిని, 151 ఎకరాల ప్రభుత్వ భూమిని జిందాల్‌కు కేటాయించడం జరిగిందని తెలిపారు. జిందాల్ కోసం ఒక్క ఎకరం భూమిని రైతుల వద్ద నుంచి సేకరించడం జరగలేదని.. 2013 భూసేకరణ చట్టం ఇక్కడ వర్తించదని కలెక్టర్ స్పష్టం చేశారు. మొత్తం 28.72 ఎకరాలకు సంబంధించి 15 మంది రైతులకు ఉన్న బకాయిని వారం రోజుల్లో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 1962లో మొత్తం 20మందికి పట్టాలు ఇవ్వగా, వారిలో నలుగురు మాత్రమే ఇళ్లు కట్టుకోగా, వారికి అప్పట్లోనే పరిహారం చెల్లించడం జరిగిందన్నారు. మిగిలినవారు ఆ స్థలాల్లో ఇళ్లు కట్టుకోకపోవడంతో, వారి పట్టాలు మూడేళ్ల తరువాత రద్దవుతాయని, అటువంటివారికి పరిహారం ఇవ్వనవసరం లేదని స్పష్టం చేశారు.

షేర్లు, ఉద్యోగ కల్పనకు, ఒన్‌టైం సెటిల్‌మెంట్‌కు సంబంధించి జిందాల్ యాజమాన్యమే రైతులతో నేరుగా ఒప్పందం కుదుర్చుకుందని, దానిలో ప్రభుత్వానికి సంబంధం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అయినప్పటికీ ఇచ్చిన హామీ మేరకు రైతులకు వెంటనే పరిహారం ఇవ్వాలని జిందాల్ ప్రతినిధులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. 53 బోర్ బావులకు సంబంధించి ఇంకా పరిహారాన్ని ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రభుత్వ పరంగా గానీ, జిందాల్ నుంచి గానీ ఎవరైనా అర్హులైన రైతులకు ఇంకా పరిహారం అందని పక్షంలో, అటువంటివారు ఎస్.కోట తహసిల్దార్‌ను సంప్రదించాలని సూచించారు. కొంతమంది వ్యక్తులు వాస్తవాలను పక్కనబెట్టి, రైతులకు మాయమాటలు చెప్పి, వారిని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, వారి మాటలను నమ్మవద్దని కలెక్టర్ కోరారు. ఇలాంటివారిపై చట్టపరమైన చర్యలను తీసుకోవడానికి సైతం వెనుకాడబోమని కలెక్టర్ హెచ్చరించారు.





## శరవేగంగా ఉరవకొండ తాగునీటి పథకం పనులు..!

**టీపీఎన్, అనంతపురం :**

రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ఉరవకొండ పట్టణంతోపాటు మరో 7 గ్రామాలకు తాగునీరు అందించే తాగునీటి పథకం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఉరవకొండ మండలంలోని నింబగల్లు గ్రామం వద్ద ఉరవకొండ పట్టణం, మరో 7 గ్రామాలకు తాగునీరు అందించే తాగునీటి పథకం పైప్ లైన్ ఏర్పాటు కోసం ఫిల్టర్ బెడ్లు సిద్ధం చేయగా, ఇందులో ఏర్పాటు చేసేందుకు మైక్రో ఫిల్టర్స్ అక్కడ చేరుకున్నాయి. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఉరవకొండ పట్టణం, ఇతర గ్రామాలకు తాగునీరు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇందులో భాగంగా అవసరమైన నిధులను విడుదల చేయించి తాగునీటి పథకం పనులను వేగవంతంగా చేపట్టేందుకు మంత్రి పయ్యావుల కేశవ్ చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఫిల్టర్ బెడ్లు నింబగల్లు వద్దకు చేరుకున్నాయి. త్వరలోనే ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా చేపట్టేందుకు ఆర్థిక మంత్రి ఆదేశాలతో సంబంధిత శాఖ అధికారులు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఇందులో భాగంగా పిఏబీఆర్ డ్యాం నుంచి ఉదిరిపికొండ, ఉదిరిపికొండ నుంచి ఉరవకొండ పట్టణానికి తాగునీటి పైప్ లైన్ పనులు పూర్తి అయి ఇప్పటికే ట్రయల్ రన్ ను అధికారులు పూర్తి చేశారు.




## మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలి : సీఐటీయూ

**టీపీఎన్, అనంతపురం :**

రాష్ట్రంలో పనిచేస్తున్న 13 వేల మంది మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఐటీయూ నగర అధ్యక్షులు వెంకటనారాయణ మున్సిపల్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు గోపాల్ డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక నగరపాలక సంస్థ నుంచి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర అధ్యక్షులు వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు గోపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. రోజురోజుకు నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని అన్నారు. ఇంటి అద్దెలు, విద్యుత్ ఛార్జీలు, విద్య, వైద్యం, అన్ని రకాల ధరలు పెరిగిపోయాయన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. జీవో 36 ప్రకారం కనీస జీతం రూ.21000 నుంచి రూ. 24500 జీతాలు చెల్లించాలన్నారు. షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలనీ, వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలనీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 75000, ఎక్స్ గ్రేషియో రూ. 7 లక్షలు, దహన సంస్కారాలకు
రూ. 20000 మంజూరు చేసేలా జీవోలు జారీ చేయాలనీ డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దు చేస్తే ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలనీ కోరారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు చేయాలనీ, చట్టబద్ధమైన సెలవులు మంజూరు చేయాలనీ డిమాండ్ చేశారు. కిట్లు, భద్రతా సౌకర్యాలు, సకాలంలో అందచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మల్లికార్జున, సంజీవ రాయుడు, నగర అధ్యక్ష కార్యదర్శులు ఓబుళపతి, మురళి, కోశాధికారి పోతులయ్య, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి, తిరుమలేష్, ఎర్రిస్వామి, లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, లక్ష్మీనారాయణ, లక్ష్మి, తులసి, వెంకటేశ్వరమ్మ, అరుణ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



## హిందీ భాషా పరిక్షల్లో శ్రీకాళహస్తి గిరిజన గురుకుల విద్యార్థులు ప్రతిభ

**టీపీఎన్, శ్రీకాళహస్తి :**

స్థానిక గిరిజన పాఠశాలల్లో గురుకుల విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ నిర్వహించిన హిందీ భాషా పరిక్షలో ఏపీ టీడబ్ల్యూఆర్ స్కూల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ ఫిబ్రవరిలో నిర్వహించిన పరిక్ష ఫలితాలు విడుదల చేశారు. ఈ పరీక్షకు పాఠశాల నుంచి 73 మంది హాజరు కాగా ప్రథమ శ్రేణిలో ప్రవేశిక, ప్రథమ, మధ్యమ, ఉత్తమ, విశారద వరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానాచార్యులు నాగేశ్వరావు తెలిపారు. ఎం యోగితాబాయి, ఆర్ రేవతి, ఎం శ్రావణి, ఎం భార్గవి, అర్చనాంజలి బాయి, కే పల్లవి ప్రథమ పరీక్షల్లో 93 శాతం మార్కులతో జిల్లాలో సంయుక్తంగా ప్రథమ స్థానంలో నిలిచారు. ఉత్తమ పరీక్షలలో బి అమృత 90 శాతం మార్కులతో జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన సమావేశంలో విద్యార్థులకు సర్టిఫికేట్లను అందజేశారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు మల్లీశ్వరి, భానుమతి, వేణు నాయుడు, నాగిరెడ్డి, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హిందీ ప్రచార సభ శ్రీకాళహస్తి కేంద్ర వ్యవస్థాపకులు తాల్లపల్లి మల్లికార్జున్ నాయుడు, ఇతర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, గ్రామస్తులు మరియు తల్లిదండ్రులు హిందీ పండిట్ విజయలక్ష్మిని అభినందించారు.



## గుంతకల్లు YSRSU టౌన్ అధ్యక్షులుగా మణికంఠ నియామకం

**టీపీఎన్, గుంతకల్లు :**

తనపై నమ్మకం ఉంచి గుంతకల్లు పట్టణ వైయస్సార్ ఎస్యు టౌన్ ప్రెసిడెంట్‌గా నియమించిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డికి మరియు వైయస్సార్సీపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి, మరియు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు మంజునాథ్ రెడ్డికి మణికంఠ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే వైవీఅర్ కార్యాలయం నందు వైసీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డికి తోటి వైస్ ప్రెసిడెంట్‌లు, జనరల్ సెక్రెటరీలు మరియు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌లు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం నిర్వహించారు.

## వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతలపై కుట్ర

**టీపీఎన్, తుని :**

వర్గీకరణ పేరుతో దళితుల మధ్య చిచ్చురేపి ఐక్యతను చెడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారంటూ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం తుని ఉడిపి లక్ష్మీ నివాస్ భవనం పైన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాదారు. కుట్రకు ప్రధాన సూత్రధారులు ప్రధాని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులేనంటూ విమర్శించారు. మాల సామాజిక వర్గం తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే అధికంగా ఉందని దేశవ్యాప్తంగా చూసుకుంటే జనాభా రాజకీయపరంగా మాదిగ సామాజిక వర్గమే ముందంజలో ఉందని తెలిపారు. ఎన్నికల వాగ్దానాలను పక్కన పెట్టి వర్గీకరణ అంశాన్ని తెరపైకి తీసుకురావడం ద్వారా రాజకీయ ప్రయోజనాల పొందేందుకు తెలుగు రాష్ట్రాల నాయకులు ప్రయత్నిస్తున్నారంటూ విమర్శించారు. జూలై 22వ తేదీన ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక దినోత్సవం జరుపుకుందామని పిలుపునిచ్చారు శాంతియుతంగా నిరసన తెలియజేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో కొండ్రు కళ్యాణ్ నెల్లి సూరిబాబు కనికేళ్ళ నానిబాబు కొప్పుల ప్రేమ్ బాబు బల్ల సత్యనారాయణ గంట మోహన్ రావు మారే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.






## ప్రతి ఒక్కరికి ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలి..!

**టీపీఎన్, కడప :**

ప్రతి ఒక్కరికి ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలని, అప్పుడే మనం మన చుట్టూ వున్న వారిని కాపాడగలుగుతామని జిల్లా రెవిన్యూ అధికారి, రెడ్ క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలంలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో శుక్రవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ప్రథమ చికిత్సపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన అయన మాట్లాడుతూ ఫస్ట్ ఎయిడ్ గురించి తెలుసుకోవడం ప్రతి ఒక్కరికి చాలా ముఖ్యమని, ఏదయినా అనుకోని ప్రమాదం జరిగితే వారిని గోల్డెన్ అవర్స్‌లో కాపాడి ప్రాణాలను నిలప వచ్చన్నారు. అనంతరం పవర్ గ్రిడ్ జనరల్ మేనేజర్ కుమార్ మాట్లాడుతూ తమ సిబ్బంది ఎక్కువగా రిస్క్ వున్న ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తుంటారని, కావున వారికి అవగాహన ఉండేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ యశస్వి, జిల్లా కోఆర్డినేటర్ సుధాకర్ లు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. అనంతరం మాక్ డ్రిల్ చేయించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వలంటీర్ పి. కిషోర్ కుమార్, పవర్ గ్రిడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## తలుపులమ్మకు తుని రాజా కుటుంబం సారె..

**తుని, టీపీఎన్ :**

తలుపులమ్మ అమ్మవారికి తుని రాజావారి కుటుంబ సభ్యులు సారెను సమర్పించారు. ఆషాడ మాసంలో వచ్చే మొదటి శుక్రవారం నాడు రాజావారి కుటుంబ సభ్యులు అమ్మవారికి సారెను సమర్పించడం గత కొన్నేళ్లుగా వస్తున్న సంప్రదాయం. దీనిలో భాగంగా ఎస్సార్‌వీవీ శ్రీనివాసరాజు పృథ్వీరాజు రమేష్ రాజు కుటుంబ సమేతంగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఈవో పెన్మత్స విశ్వనాథరాజు రాజా వారి కుటుంబ సభ్యులకు స్వాగతం పలికారు. పసుపు, కుంకుమ, చీర, గాజులు అమ్మవారికి సారెగా సమర్పించారు. అనంతరం వీరంతా అమ్మవారికి విశేషంగా నిర్వహించిన కుంకుమార్చన పూజలో పాల్గొన్నారు. అర్చకులు పూజలు జరిపి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.







# ఆంధ్రప్రదేశ్‌లో సెక్స్ వర్క్, ట్రాఫికింగ్ సంక్షోభం..!

ఆంధ్రప్రదేశ్ ఒక నిశ్శబ్దమైన, కానీ లోతుగా పాతుకుపోయిన మానవతా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. NACO యొక్క 2024 ప్రోగ్రామాటిక్ మ్యాపింగ్ మరియు పాపులేషన్ సైజ్ ఎస్టిమేషన్ (PMPSE) ప్రకారం, రాష్ట్రంలో 1.33 లక్షల మహిళా సెక్స్ వర్కర్లు (FSWs) ఉన్నారు——ఇది భారతదేశంలోని మొత్తం సంఖ్యలో 12% వాటాను కలిగి ఉంది. సెక్స్ వర్క్ యొక్క డెన్సిటీలో రాష్ట్రం దేశంలో రెండవ స్థానంలో ఉంది, ఒక్కో హాట్‌స్పాట్‌కు సగటున 29 FSWలు ఉన్నారు, జాతీయ సగటు కేవలం 8 మాత్రమే.

ఈ ఆందోళనకర సంఖ్యల వెనుక మరింత ప్రమాదకరమైన ధోరణి ఉంది: రాష్ట్రంలో 55% కంటే ఎక్కువ సెక్స్ వర్క్ హాట్‌స్పాట్‌లు గృహఆధారితమైనవి, ఇవి ఈ వ్యాపారాన్ని అనధికారికంగా, అదృశ్యంగా, మరియు ప్రమాదకరంగా మారుస్తున్నాయి. ఈ స్థలాలు కేవలం కార్యాలయాలు మాత్రమే కాదు——ఇవి గృహాలు, ఇక్కడ పిల్లలు దోపిడీ, హింస, మరియు రెండవ తరం ట్రాఫికింగ్ యొక్క నీడలో పెరుగుతున్నారు. కృష్ణ, గుంటూరు, మరియు ప్రకాశం జిల్లాలలో, ఎన్జీవో హెల్ప్ పనిచేసే ప్రాంతాలలో, సంక్షోభం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. సుమారు 35,000 సెక్స్ వర్క్‌లో నిమగ్నమైన మహిళలు 64,000 ఆధారపడిన వారిని, వేలాది హాని కలిగిన పిల్లలతో సహా, ఆదుకుంటున్నారు. ఈ పిల్లలు నిర్లక్ష్యం, స్కూల్ డ్రాపౌట్, బాల వివాహం, మరియు తమ తల్లులు ఎదుర్కొన్న అదే దోపిడీ వ్యవస్థలలోకి ప్రవేశించే అధిక ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ అత్యవసర వాస్తవాలు ఉన్నప్పటికీ, సంస్థాగత ప్రతిస్పందన దయనీయంగా ఉంది.

**సహాయం లేని ఆశ్రయం**

2019 నుండి జూన్ 2023 వరకు, మహిళా అభివృద్ధి & బాల సంక్షేమ విభాగం (DWDCW) నివేదికల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో 2,737 ట్రాఫికింగ్ బాధితులు ఆశ్రయ గృహాలలో ఉంచబడ్డారు. ఇందులో 2,265 మంది ఉజ్జ్వల హోమ్స్‌లో, 447 మంది స్వధార్ హోమ్స్‌లో, మరియు 25 మంది ఎన్జీవోనడిపే ఆశ్రయ గృహాలలో ఉన్నారు. అయినప్పటికీ, ఆశ్రయం అందుకోవడం రికవరీ లేదా న్యాయానికి హామీ ఇవ్వదు. G.O. Ms. No. 28 కింద, రక్షించబడిన బాధితులు రూ. 20,000 తక్షణ సహాయానికి అర్హులు. కానీ విముక్తి RTI పరిశోధన ప్రకారం, 2,737 మంది బాధితులలో కేవలం 132 మంది (5% కంటే తక్కువ) మాత్రమే ఈ ప్రయోజనాన్ని పొందారు——అయినా వారు రాష్ట్ర సంరక్షణలో ఉన్నారు. ఇంకా దారుణం ఏమిటంటే, బాధితులు తమ హక్కుల గురించి తెలియకుండా ఉంటారు, మరియు ఆశ్రయ సిబ్బంది వారికి సహాయ పథకాలను అందుకోవడంలో సహాయం చేయరు. విక్టిమ్ కాంపెన్సేషన్ స్కీమ్, బాధితులను ఆర్థికంగా పునరావాసం చేయడానికి ఉద్దేశించినది, మరింత దిగ్భ్రాంతికరమైన చిత్రాన్ని చూపిస్తుంది. 2016 నుండి 2022 వరకు, ఆంధ్రప్రదేశ్‌లో 2890 మానవ ట్రాఫికింగ్ బాధితులు గుర్తించబడ్డారు. అయినప్పటికీ, కేవలం 5 దరఖాస్తులు మాత్రమే పరిహారం కోసం సమర్పించబడ్డాయి——అన్నీ కృష్ణ జిల్లాలోని మచిలీపట్నం నుండి. ఇంకా షాకింగ్ విషయం ఏమిటంటే, ఈ కాలంలో రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీలకు కేటాయించిన రూ. 12.14 కోట్లలో ఒక్క రూపాయి కూడా ట్రాఫికింగ్ బాధితులకు చెల్లించబడలేదు.

సంస్థాగత వైఫల్యం, ప్రత్యామ్నాయాల అవసరం

రాష్ట్రం ఆశ్రయ గృహాలపై ఆధారపడిన సంస్థాగత సంరక్షణ నమూనాలు బాధితులను పునరావాసం చేయడంలో నిరంతరం విఫలమవుతున్నాయి. 2,737 ఆశ్రయ నివాసులలో, కేవలం 692 మంది బాధితులు పునరావాసం లేదా సంక్షేమ అర్హతల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారిలో, కేవలం 592 మంది బాధితులు సహాయం పొందారు, ఇది కేవలం 22% విజయ రేటును సూచిస్తుంది.

ఈ డేటా ఆశ్రయఆధారిత పునరావాసం యొక్క నిర్మాణాత్మక లోపాలను బహిర్గతం చేస్తుంది: పరిమిత ఔట్‌రీచ్, నీచమైన న్యాయ సహాయం, మానసిక సలహా లేకపోవడం, మరియు ముఖ్యంగా, ఆర్థిక స్వాతంత్ర్యం మరియు సామాజిక పునరావాసంపై శూన్య దృష్టి.

అవసరమైనది సంస్థాగత సంరక్షణ నుండి కమ్యూనిటీబేస్డ్ రిహాబిలిటేషన్ (CBR) వైపు మార్పు. CBR ఒక బాధితకేంద్రీకృత నమూనాను అందిస్తుంది, ఇది గౌరవం, స్వాతంత్ర్యం, మరియు సమ్మిళితంపై ఆధారపడి ఉంటుంది. అంతర్జాతీయంగా గుర్తించబడిన మరియు జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్ 2015తో సమన్వయం చేయబడిన CBR విధానాలు, ఫోస్టర్ కేర్, దత్తత, నగదు బదిలీలు, మరియు స్పాన్సర్‌షిప్‌ల వంటి సంస్థాగతం కాని సంరక్షణను ప్రాధాన్యం చేస్తాయి. ఈ నమూనాలు ఆశ్రయ వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించడమే కాకుండా, విద్య, ఉపాధి, గృహనిర్మాణం, మరియు సామాజిక భద్రతకు ప్రాప్యత ద్వారా బాధితులు తమ జీవితాలను సమాజంలో పునర్నిర్మాణం చేయడానికి సహాయపడతాయి.

**తక్షణ చర్యకు సమయం**

ఈ సంఖ్యలు కేవలం గణాంకాలు కాదు; అవి సిస్టమాటిక్ అపాథీని ప్రతిబింబిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో, ట్రాఫికింగ్ నుండి రక్షించబడిన ఒక మహిళకు అత్యవసర సహాయం పొందే అవకాశం 20లో 1 కంటే తక్కువ. ఆమెకు పరిహారం లేదా దీర్ఘకాలిక పునరావాసం పొందే అవకాశం ఇంకా తక్కువ.

**ఈ గమనాన్ని మార్చడానికి, విధాన నిర్మాతలు, సివిల్ సొసైటీ, మరియు స్థానిక సమాజాలు తక్షణ సంస్కరణలను డిమాండ్ చేయాలి:**

విక్టిమ్ కాంపెన్సేషన్‌ను స్ట్రీమ్‌లైన్ చేయడం మరియు ఆశ్రయాల నుండి చురుకైన సహాయాన్ని నిర్ధారించడం.

ప్రభుత్వం మరియు గ్రాస్‌రూట్ సంస్థల మధ్య భాగస్వామ్యంతో CBR నమూనాలను విస్తరించడం.

ఆశ్రయ గృహాలను బాధిత ఫలితాల కోసం పర్యవేక్షించడం మరియు మూల్యాంకనం చేయడం, కేవలం ఆక్యుపెన్సీ కోసం కాదు. ఆశ్రయ సిబ్బంది మరియు న్యాయ సహాయ బృందాలకు బాధితుల హక్కులు మరియు అర్హతలపై శిక్షణ ఇవ్వడం.ఆంధ్రప్రదేశ్ ట్రాఫికింగ్ హాట్‌స్పాట్‌గా ఉన్న చిత్రాన్ని వదిలించుకోవాలనుకుంటే, ప్రస్తుత వ్యవస్థ యొక్క వైఫల్యాలను గుర్తించడం ద్వారా ప్రారంభించాలి——మరియు బాధితులను నిజంగా శక్తివంతం చేసే నమూనాలను అవలంబించాలి.



నిమ్మరాజు రామ్మోహన్,
హెల్ప్ ఆర్గనైజేషన్ సెక్రటరీ

# 100 ఏళ్ల సంఘర్షణ.. ఇరాన్‌ఇజ్రాయెల్ సంబంధాలు ఎలా తెగిపోయాయి..!





ఇరాన్‌ఇజ్రాయెల్ సంఘర్షణ నీడలో నడిచే మధ్యప్రాచ్యంలోని అత్యంత దీర్ఘకాలిక మరియు అస్థిరమైన ప్రత్యర్థిత్వాలలో ఒకటిగా నిలిచింది. ప్రస్తుత వార్తాశీర్షికలు ఈ రెండు దేశాల మధ్య తీవ్రమైన శత్రుత్వాన్ని చిత్రిస్తున్నప్పటికీ, లోతైన చారిత్రక విశ్లేషణ ఒక సంక్లిష్టమైన మరియు అభివృద్ధి చెందుతున్న సంబంధాన్ని వెల్లడిస్తుంది. 1979కు ముందు వ్యూహాత్మక సహకారం నుండి భావజాల వైరుధ్యం, ప్రాక్సీ యుద్ధాలు, మరియు ఇప్పుడు ప్రత్యక్ష సైనిక ఘర్షణ వరకు, ఇరాన్‌ఇజ్రాయెల్ సంబంధాల గమనం ప్రాంతీయ మరియు ప్రపంచ రాజకీయాలలో విస్తృత మార్పులను ప్రతిబింబిస్తుంది.

**1979కు ముందు వ్యూహాత్మకం కానీ బలహీనమైన కూటమి**

ఆధునిక అవగాహనకు విరుద్ధంగా, ఇరాన్ మరియు ఇజ్రాయెల్ ఒకప్పుడు వ్యూహాత్మక భాగస్వాములు. షా మహ్మద్ రెజా పహ్లావీ పాలనలో, ఇరాన్ 1950లో ఇజ్రాయెల్‌ను గుర్తించిన కొన్ని ముస్లింమెజారిటీ దేశాలలో ఒకటిగా మారింది. ఈ కూటమి, భావజాల సమన్వయం కాకుండా, ఉమ్మడి భౌగోళిక రాజకీయ ప్రయోజనాల ద్వారా నడిచింది, శీతల యుద్ధ సమయంలో వృద్ధి చెందింది. ఈ రెండు దేశాలు ఈజిప్టు గమాల్ అబ్దుల్ నాసర్ నాయకత్వంలో అరబ్ జాతీయవాదం యొక్క ఉద్భవాన్ని వ్యతిరేకించాయి. ఇరాన్ ఇజ్రాయెల్‌కు నిషేధ సమయంలో చమురు సరఫరా చేసింది, అలాగే రెండు దేశాలు గూఢచర్యం మరియు సైనిక సహకారంలో, టర్కీతో "ట్రైడెంట్" కూటమితో సహా, పాల్గొన్నాయి. ఈ కాలం, ఉమ్మడి బెదిరింపులు మరియు వ్యవహారిక రాజకీయాలు సాంస్కృతిక మరియు మతపరమైన విభజనలను దాటవచ్చని చూపించింది. అయితే, ఈ కూటమి షా పాలనపై ఎక్కువగా ఆధారపడింది——1979లో స్పష్టమైన ఒక బలహీనత.

**1979 ఇస్లామిక్ విప్లవం ఒక మలుపు**

ఇస్లామిక్ విప్లవం ఇరాన్ యొక్క దేశీయ మరియు విదేశీ విధానాన్ని పునర్నిర్మించింది. షాను పడగొట్టడం మరియు అయాతొల్లా రుహొల్లా ఖొమైనీ ఉద్భవం ఇజ్రాయెల్‌తో సంబంధాలను ముగించింది. ఖొమైనీ యొక్క జియోనిస్ట్ వ్యతిరేక వైఖరి ఇజ్రాయెల్‌ను పాశ్చాత్య సామ్రాజ్యవాదం మరియు అక్రమత్వం యొక్క చిహ్నంగా చిత్రించింది. ఇజ్రాయెల్‌ను కాన్సర్ ట్యూమర్ అని పిలిచి, ఇరాన్ ఒక ఘర్షణాత్మక వైఖరిని అవలంబించింది, పాలస్తీనా ప్రతిఘటనకు మద్దతు ఇస్తామని ప్రతిజ్ఞ చేసి, టెల్ అవీవ్‌తో అన్ని దౌత్య సంబంధాలను తెంచుకుంది. ఈ విప్లవం ఇరాన్‌ను ఒక విప్లవాత్మక ఇస్లామిక్ రాష్ట్రంగా గుర్తించింది, ఇది ఇజ్రాయెల్‌తో ఘర్షణ మార్గంలో నడిచింది, దాని భద్రతా విధానాలు జీవన బెదిరింపులను తటస్థీకరించడంపై ఆధారపడ్డాయి. ఈ భావజాల విచ్ఛిన్నం రెండు రాష్ట్రాల మధ్య లోతైన మరియు దీర్ఘకక విభజనను సృష్టించింది.

ప్రాక్సీ యుద్ధం: ప్రాంతీయ ప్రభావంతో పరోక్ష సంఘర్షణ

ప్రత్యక్ష యుద్ధంలో పాల్గొనడం కాకుండా, ఇరాన్ మరియు ఇజ్రాయెల్ దీర్ఘకాలిక ప్రాక్సీ సంఘర్షణ దశలోకి ప్రవేశించాయి. ఇరాన్ లెబనాన్‌లో హెజ్బొల్లా, గాజాలో హమాస్, ఇరాక్ మరియు సిరియాలో షియా మిలీషియాలతో సహా రాష్ట్రేతర కారకాల నెట్‌వర్క్‌ను నిర్మించింది, ఇవి ప్రభావాన్ని ప్రసరించడానికి మరియు ఇజ్రాయెల్‌ను ప్రత్యక్ష ఘర్షణ లేకుండా హింసించడానికి ఉపయోగించాయి. 2006 లెబనాన్ యుద్ధంలో హెజ్బొల్లా పాత్ర ఈ విధానాన్ని ఉదాహరణగా చూపింది. దాని వైపు, ఇజ్రాయెల్ ముందస్తు వ్యూహాలు మరియు రహస్య కార్యకలాపాలను ఉపయోగించింది, ఉదాహరణకు 2010లో ఇరాన్ యొక్క అణు సౌకర్యాలపై స్టక్స్‌నెట్ సైబర్ దాడి మరియు 2020లో అణు శాస్త్రవేత్త మొహ్సెన్ ఫఖ్రిజాదెహ్ హత్య. ఈ నీడ యుద్ధం రెండు దేశాలకు స్థిరమైన ప్రచారాన్ని నడిపించడానికి అనుమతించింది, ఇది ఇటీవల వరకు పూర్తి యుద్ధాన్ని నివారించింది.

**2020లో బహిరంగ సంఘర్షణకు ఉద్ధృతి**

2020లలో వ్యూహాత్మక గణన గణనీయంగా మారింది. 2024 ఏప్రిల్‌లో, ఇరాన్ ఇజ్రాయెల్‌పై భారీ డ్రోన్ మరియు క్షిపణి దాడిని ప్రారంభించింది——1979 తర్వాత మొదటి ప్రత్యక్ష దాడి——ఇజ్రాయెల్ దాని డమాస్కస్ కాన్సులేట్‌పై దాడి చేయడం దీనికి కారణం. ఇజ్రాయెల్ దీనికి బలంగా స్పందించింది, జూన్ 2025లో “ఆపరేషన్ రైజింగ్ లయన్”లో ఇరాన్ సైనిక మరియు అణు స్థలాలను లక్ష్యంగా చేసుకుంది. ఈ కొత్త బహిరంగ ఘర్షణ దశ, దశాబ్దాల ప్రాక్సీ వ్యూహం నుండి ఒక విచలనాన్ని సూచిస్తుంది, ఇది ప్రాంతీయ ఉద్ధృతి యొక్క ప్రమాదాన్ని పెంచుతుంది.

**ముగింపు: చరిత్రలో ఊనిక ఉన్న సంఘర్షణ**

ఇరాన్‌ఇజ్రాయెల్ ప్రత్యర్థిత్వం కేవలం భావజాలం లేదా మతం యొక్క ఉత్పత్తి కాదు——ఇది మారుతున్న కూటములు, ప్రాంతీయ ఆశయాలు మరియు ప్రపంచ శక్తి గతిశీలతల ద్వారా రూపొందిన చారిత్రక కథనం. సహచరుల నుండి ప్రత్యర్థులకు, ఈ సంబంధం మధ్యప్రాచ్య భవిష్యత్తు కోసం విస్తృత పోరాటాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ పరిణామాన్ని అర్థం చేసుకోవడం విధాన రూపకర్తలకు మాత్రమే కాక, ఈ ఎప్పటికీ లోతవుతున్న సంఘర్షణ యొక్క ప్రమాదాలను అర్థం చేసుకోవాలనుకునే అందరికీ కీలకం.




## అమెరికాఇజ్రాయెల్‌ను మోసం చేసిన ఇరాన్

అమెరికా, ఇజ్రాయెల్ ను ఇరాన్ చాలా తెలివిగా మోసం చేసింది. ఇన్నాళ్లు ప్రపంచంలో తామే గొప్ప మేధావులమని చెప్పుకునే నెతన్యాహు, ట్రంప్ ఇరాన్ పై దాడి తర్వాత కాదని తేలిపోయింది. బాంబర్ వంటి అత్యాధునిక విమానంతో అణు స్థావరాలపై దాడి చేసినా అమెరికా ..యురేనియంను మాత్రం పూర్తిగా నాశనం చేయలేదని అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ముందే పసిగట్టిన ఇరాన్ సుప్రీం లీడర్.. కొత్త రహస్య అణు స్థావరాన్ని నిర్మించారు. నటాంజ్ నుండి కొద్ది దూరంలో ఉన్న పికాక్స్ పర్వతం యొక్క వాలులలో ఇజ్రాయెల్ నాలుగు సొరంగాలను తవ్విందని అంతర్జాతీయ నిపుణులు పేర్కొన్నారు. ప్రతి సొరంగం 6 మీటర్లు వెడల్పు, 8 మీటర్లు ఎత్తు ఉంటుంది. ఉపగ్రహ చిత్రాల ఆధారంగా ఇరాన్ బహుశా 260 అడుగుల నుంచి 328 అడుగుల లోతులో ఇక్కడ అణు పరిశోధన కేంద్రాన్ని నిర్మిస్తోందని నిపుణులు తెలిపారు. పర్షియన్ భాషలో కుహ్ అంటే పర్వతం. కోలాంగ్ అంటే పికాక్స్ లేదా హూ. పర్షియన్ పదమైన కుహ్ఎకోలాంగ్ గజ్ లా అంటే పికాక్స్ లేదా హూ లా కనిపించే పర్వతం. ఆంగ్లంలో దీనిని పికాక్స్ పర్వతం అంటారు. కుహ్ఎకోలాంగ్ గజ్ లా అనే పదం గురించి ప్రజలకు పెద్దగా తెలియదు. కానీ ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడుల తర్వాత, ఈ ఒక్క పదం గురించి చాలా చర్చ జరుగుతోంది. ఇప్పుడు కుహ్ఎకోలాంగ్ గజ్ లా అనేది ఇరాన్‌లోని పర్వతంలోని భాగం అని, అక్కడ అమెరికా దాడికి ముందు ఇరాన్ తన సుసంపన్నమైన యురేనియంను దాచిపెట్టిందని చెబుతున్నారు.

**పికాక్స్ పర్వత రహస్యం..**

ఇటీవల, అమెరికా B2 స్టెల్త్ జెట్‌లతో ఫోర్డో , నటాంజ్‌లోని ఇరాన్ అణు కేంద్రాలపై దాడి చేసింది. అమెరికా దానిపై 30 వేల పౌండ్ల బంకర్‌బంస్టింగ్ బాంబులను జారవిడిచింది. ఈ దాడి ఇరాన్ అణు కార్యక్రమాన్ని 'నాశనం' చేసిందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. కానీ ట్రంప్ వాదనను అమెరికన్ ఏజెన్సీలు మాత్రమే కాకుండా ఇరాన్ కూడా ప్రశ్నించాయి. ఇరాన్ తన సమృద్ధ యురేనియం సురక్షితమని తెలిపింది. అమెరికా దాడికి ముందు, ఫోర్డో అణు విద్యుత్ కేంద్రం వెలుపల 16 ట్రక్కుల క్యూ కనిపించింది. యూఎస్ బాంబు దాడి చేయడానికి ముందు ఇరాన్ ప్రభుత్వం తన అత్యంత సంపన్నమైన యురేనియంను రహస్య ప్రదేశానికి బదిలీ చేసిందని ఇరాన్ అణు కార్యక్రమంపై నిపుణుడు ఒకరు టెలిగ్రాఫ్‌తో చెప్పారు. ఆ రహస్య ప్రదేశం కుహ్ఎకోలాంగ్ గజ్‌లా లేదా పికాక్స్ పర్వతం కావచ్చునని నివేదించబడింది. అంటే ఇరాన్ యొక్క సుసంపన్నమైన యురేనియంను పికాక్స్ పర్వతంలో నిల్వ చేయవచ్చు.

అధునాతన సెంట్రిఫ్యూజ్‌లను దాచి ఉంచగలిగే వందలాది ప్రదేశాలను టెహ్రాన్ దాచిపెట్టినట్టు తెలుస్తోంది. ఈ సెంట్రిఫ్యూజ్‌లు అణు బాంబులకు అవసరమైన ఆయుధ గ్రేడ్ యురేనియంను తయారు చేయగల సామర్థ్యం కలిగి ఉన్నాయి. ఈ సమాచారాన్ని ఇజ్రాయెల్ సైన్యంలో 30 ఏళ్లుగా పనిచేస్తున్న సిమా షైన్ అందించారు.

**పికాక్స్ పర్వతం ఎక్కడ ఉంది?**

ఇరాన్ కొత్త అణు ప్రాజెక్టు అయిన పికాక్స్ పర్వతం టెహ్రాన్‌కు దక్షిణంగా దాదాపు 225 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది ఫోర్డోకు దక్షిణంగా 90 మైళ్ల దూరంలో ఉంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో, ప్లానెట్ ల్యాబ్స్ అనే సంస్థ ఆ ప్రదేశం యొక్క ఉపగ్రహ చిత్రాలను తీసినప్పుడు, ఇరాన్ పికాక్స్ పర్వతం దగ్గర నెమ్మదిగా తవ్వుతున్నట్లు తెలిసింది. ఇది నటాంజ్ దక్షిణ ఆవరణ నుండి కొంత దూరంలో ఉందని ఉపగ్రహ చిత్రాలు చూపిస్తున్నాయి. ఈ సముదాయాన్ని ఇరాన్ యొక్క IRGC కమాండర్లు కాపలాగా ఉంచుతారు. ఈ అణు ప్రదేశం ఇరాన్ మధ్యలో ఉన్న పొడి పీఠభూముల మధ్య 2.7 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది.

**నాలుగు ప్రవేశ ద్వారాలు..**

జేమ్స్ మార్టిన్ సెంటర్ ఫర్ నాన్‌ప్రొలిఫరేషన్ స్టడీస్ పరిశోధించిన ఛాయాచిత్రాలు ఈ పర్వతం యొక్క వాలులో నాలుగు సొరంగాలు తవ్వబడ్డాయని చూపిస్తున్నాయని ఓ నివేదిక తెలిపింది. వీటిలో రెండు తూర్పు వైపున, రెండు పశ్చిమ వైపున ఉన్నాయి. ప్రతి సొరంగం 6 మీటర్లు అంటే 20 అడుగుల వెడల్పు, 8 మీటర్లు అంటే 26 అడుగుల ఎత్తు ఉంటుంది. ఇరాన్ 260 అడుగులు, 328 అడుగుల లోతులో అణు పరిశోధన కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. కుహ్ఎకోలాంగ్ గజ్‌లా వద్ద నిర్మిస్తున్న అణు స్థావరాన్ని 1,608 మీటర్ల ఎత్తైన పర్వతం కింద నిర్మిస్తున్నారు, ఇది ఫోర్డో 960 మీటర్లు కంటే చాలా ఎత్తు , లోతుగా ఉంటుంది. ఈ సౌకర్యం చాలా లోతుగా నిర్మించబడింది. US GBU57 బంకర్ బస్టర్ బాంబులతో కూడా దానిని నాశనం చేయడం కష్టం కావచ్చు. ఇరాన్ ఈ భూగర్భ అణు కేంద్రంలో యురేనియంను సుసంపన్నం చేయడమే కాకుండా, ఇక్కడ సెంట్రిఫ్యూజ్‌లను కూడా తయారు చేయగలదని నిపుణులు అంటున్నారు. ఈ కాంప్లెక్స్ గత నాలుగు సంవత్సరాలలో మరింత విస్తరించబడింది. రాళ్ల మధ్య ఉండటం వల్ల, ఈ అణు కేంద్రం మరింత బలంగా, రహస్యంగా , సురక్షితంగా ఉంటుందని చెబుతున్నారు.

## త్వరలో రష్యా నుంచి మరో రెండు S400 మిస్సైల్స్



భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తో పాక్ వెన్నులో వణుకుపుట్టింది. 23 నిమిషాల్లోనే ఉగ్రమూకల స్థావరాలను నేలమట్టం చేశారు. అయితే అటు పాక్ కూడా దాడులు చేసింది. కానీ సరిహద్దుల్లో అమర్చిన S400 మిస్సైల్ రక్షణ వ్యవస్థ సమర్థవంగా దాయాది క్షిపణులు, డ్రోన్స్ ను నేలమట్టం చేసింది. యావత్ ప్రపంచం రష్యా తయారు చేసిన S400 వ్యవస్థపై అందరి ఫోకస్ పడింది. ఇప్పుడు మరో రెండు S400 వ్యవస్థ యూనిట్లను అందించనుంది. భారత్, రష్యా ఒప్పందం మేరకు 20262027లో భారత్ కు అందజేయనుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ , రష్యా రక్షణ మంత్రి ఆండ్రీ బెలౌసోవ్ కింగ్‌డావోలో సమావేశమై S400 వ్యవస్థ సరఫరా, Su30 MKI అప్‌గ్రేడ్ , ఇతర సైనిక పరికరాల కొనుగోలుపై చర్చించారు. రష్యా నుంచి అందించే ఆత్యాధునిక ఆయుధాలు సమకూరితే భారతదేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం అవుతుంది. చైనాలోని కింగ్‌డావోలో జరిగిన షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశం సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రష్యా రక్షణ మంత్రి ఆండ్రీ బెలౌసోవ్‌తో ఒక ముఖ్యమైన ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ప్రాంతీయ.. ప్రపంచ భద్రతకు అలాగే భారతదేశంరష్యా రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం కానుంది. రష్యాతో ఈ సమావేశం ఒక ముఖ్యమైన ముందడుగు.

ఈ ఏడాది మేలో భారత్, పాకిస్తాన్ మధ్య సైనిక వివాదం తర్వాత ప్రాంతీయ భద్రతా పరిస్థితి సంక్లిష్టంగా మారిన సమయంలో ఈ సమావేశం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. 2025 ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో నేపాలీ పౌరుడు సహా 26 మంది పౌరులు మరణించారు. ఈ దాడికి ప్రతిస్పందనగా భారతదేశం పాకిస్తాన్ , పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడులు చేసి ముష్కరులను చంపేసింది.

కింగ్‌డావోలో జరిగిన SCO రక్షణ మంత్రుల సమావేశంలో రష్యా రక్షణ మంత్రి ఆండ్రీ బెలౌసోవ్‌ను కలవడం ఆనందంగా ఉందని రాజ్ నాథ్ సింగ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ Xలో రాశారు. భారతదేశంరష్యా రక్షణ సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై చర్చలు జరిపామన్నారు. ముఖ్యంగా బ్రహ్మోస్ క్షిపణి, T90 ట్యాంక్, MiG29, కామోవ్ హెలికాప్టర్ , AK203 రైఫిల్ వంటి ఉమ్మడి ప్రాజెక్టులను మరింత వేగవంతం చేయడం గురించి కూడా రెండు దేశాల నేతలు చర్చించుకున్నట్టు సమాచారం.

**S-400 వైమానిక రక్షణ వ్యవస్థ సరఫరా**

2018లో భారతదేశం రష్యాతో 5.43 బిలియన్ల ఒప్పందంపై సంతకం చేసింది. ఇందులో ఐదు S400 ట్రయంఫ్ వైమానిక రక్షణ వ్యవస్థల కొనుగోలు ఉంది. ఈ వ్యవస్థ క్షిపణులు, డ్రోన్లు ఫైటర్ జెట్‌లు వంటి బహుళ వైమానిక ముప్పులను సుదూర ప్రాంతాలలో నాశనం చేయగలదు. ఇప్పటివరకు మూడు S400 యూనిట్లు భారత్ కు డెలివరీ అయ్యాయి. మిగిలిన రెండు యూనిట్లు రాబోయే 24 నెలల్లో భారత్ అమ్ముల పొదిలోకి రానుంది. రష్యా రక్షణ మంత్రి ఈ యూనిట్లను సకాలంలో డెలివరీ చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా చైనా, పాకిస్తాన్ వంటి పొరుగు దేశాల నుండి కవ్వింపులకు పాల్పడుతుండటంతో భారతదేశ రక్షణ సామర్థ్యాన్ని పెంచడంలో ఈ వ్యవస్థ కీ రోల్ ప్లే చేస్తుంది.

**యుద్ధ విమానాల ఆధునీకరణ**

భారత వైమానిక దళం దగ్గర దాదాపు 260 Su30 MKI ఫైటర్ జెట్‌లు ఉన్నాయి. ఇవి దాని వెన్నెముకగా నిలుస్తాయి. ఈ విమానాలు ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించాయి, దీనిలో వారు బ్రహ్మోస్ క్షిపణి యొక్క వైమానిక వెర్షన్‌ను ఉపయోగించి పాకిస్తాన్ వైమానిక స్థావరాలపై దాడి చేశారు.

**భారతదేశం-రష్యా రక్షణ సహకారం**

భారత్, రష్యా మధ్య రక్షణ సహకారం అనేక దశాబ్దాల నుంచి కొనసాగుతోంది. ఇది భారతదేశంరష్యా ఇంటర్‌గవర్నమెంటల్ కమిషన్ ఆన్ మిలిటరీ అండ్ టెక్నికల్ కోఆపరేషన్ కింద నిర్వహించబడుతుంది. ఈ సహకారం ఆయుధాల కొనుగోలుకే పరిమితం కాకుండా ఉమ్మడి పరిశోధన, అభివృద్ధి , ఉత్పత్తిని కూడా కలిగి ఉంటుంది. మొత్తానికి రష్యా అందించే అత్యాధునిక ఆయుధాలు భారత్ కు అందింతే పొరుగు దేశాలు మనవైపు కన్నెత్తి చూడాలన్నా భయంతో వణికిపోవాల్సిందే.

## కన్నుల పండువగా పూరీ జగన్నాథుడి రథయాత్ర



ఒడిశాలోని పూరీ జగన్నాథుడి రథయాత్రకు ఇసుకేస్తే రాలనంత జనం తరలివచ్చారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు పూరీ నగర వీధులు భక్తుల కిటకిటలాడాయి. దీంతో పూరీ క్షేత్రం మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయింది. వేల సంఖ్యలో భక్తులు 'జై జగన్నాథ్', 'హరిబోల్' నినాదాలతో రథం వెంట నడుస్తూ ముందుకు సాగారు. ఈ వేడుకలో 12 లక్షల మందికిపైగా భక్తులు పాల్గొన్నారని అధికారుల అంచనా. దానికి తగినట్లుగా ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఒడిశా ప్రభుత్వం.. తొలిసారిగా 275 ఏఐ కెమెరాలు, డ్రోన్ల ద్వారా రద్దీ నియంత్రణకు ఏర్పాట్లు చేసింది.

12 రోజుల పాటు కొనసాగనున్న ఈ వేడుకకు దేవస్థానం వారు దాదాపు రెండు నెలల ముందు నుంచే ఈ యాత్రకు ఏర్పాట్లు చేశారు.సాధారణంగా హిందూ ఆలయాల్లో ఉత్సవ మూర్తులను ఊరేగిస్తారు. కానీ దీనిక భిన్నంగా పూరీలో మూల విరాట్టునే గర్భ గుడి నుంచి తీసుకొస్తారు. ఏటా కొత్త రథాలను తయారు చేస్తారు రాజు బంగారు చీపురుతో ఊడ్చి రథయాత్రను ప్రారంభిస్తారు. లక్షలాది మంది భక్తులు రథాన్ని లాగుతారు. జగన్నాథుడు, బలభద్రుడు, తమ సోదరి సుభద్ర దేవిలతో కలిసి పెంచిన తల్లి గుండిచా ఆలయానికి ఊరేగింపుగా చేరుకుని.. అక్కడ వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకుంటారు. ఆ తర్వాత తిరిగి ఆలయానికి వస్తారు. ఈ యాత్రను చూడటం ఒక అదృష్టంగా భావిస్తారు.



## వాళ్లది కుర్చీ కోసమే ఆరాటం : జై శంకర్

కాంగ్రెస్ ప్రభుత్వంపై విదేశాంగ మంత్రి జై శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. అధికారం కోసం గాంధీ కుటుంబం ఎంతకైనా తెగిస్తుందని ఆరోపించారు. ఎమర్జెన్సీ సమయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల దేశ ప్రజల ప్రాథమిక హక్కులకు తీవ్ర విఘాతం కలిగిందని గుర్తుచేశారు. యూపీఏ హయాంలో అవినీతి, అక్రమాలు, అధిక ద్రవ్యోల్బణం పెరిగిపోవడంతో ఆ పార్టీకి ప్రజల్లో ప్రజాధారణ లేకుండా పోయిందన్నారు. అలాంటి పరిస్థితుల్లో తమ అధికారాన్ని, కుర్చీని కాపాడుకోవడం కోసమే కాంగ్రెస్ ఎమర్జెన్సీని అస్త్రంగా వాడుకుందన్నారు. స్వేచ్ఛను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోకూడదనే గుణపాఠాన్ని ఎమర్జెన్సీ మనకు నేర్పిందన్నారు.

## చైనా, పాక్ కుట్ర...భారత్‌కు ఎంత ప్రమాదకరమో..?



పాకిస్తాన్ తో చైనా ఉపగ్రహ డేటాను పంచుకోవడం అనేది పాకిస్తాన్ సైనిక సామర్థ్యాలను పెంచే మరియు భారతదేశానికి కొత్త సవాళ్లను సృష్టించే వ్యూహాత్మక చర్య. యుద్ధ సమయాల్లో, ఈ సహాయం పాకిస్తాన్ భారత సైనిక కార్యకలాపాలను ట్రాక్ చేయడానికి మరియు దాడులను మరింత ఖచ్చితమైనదిగా చేయడానికి సహాయపడుతుంది, ప్రాంతీయ ఉద్రిక్తతలు మరియు అణు యుద్ధ ప్రమాదాన్ని పెంచుతుంది.చైనా , పాకిస్తాన్ మధ్య లోతైన సైనిక , వ్యూహాత్మక సహకారం చాలా కాలంగా కొనసాగుతోంది. ఇటీవల కొన్నేళ్లుగా ఇది మరింత బలోపేతం అయ్యింది. ముఖ్యంగా ఈ ఏడాది మేలో భారతదేశంపాకిస్తాన్ ఉద్రిక్తతల సమయంలో, చైనా పాకిస్తాన్‌తో ఉపగ్రహ డేటాను షేర్ చేసుకున్నట్టు తెలిసింది. ఈ సహకారం ప్రాంతీయ , ప్రపంచ భద్రతకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. ప్రాంతీయ ఉద్రిక్తలు అణు యుద్ధ ప్రమాదాన్ని ప్రేరేపించే అవకాశం ఉంది.

**చైనా ఉపగ్రహ డేటాను పంచుకోవడం అంటే ఏమిటి?**

ఉపగ్రహ డేటాను పంచుకోవడం అంటే చైనా తన సైనిక, నిఘా ఉపగ్రహాల నుండి పొందిన సమాచారాన్ని, చిత్రాలు, రాడార్ డేటా ,సైనిక కార్యకలాపాల పర్యవేక్షణ వంటి వాటిని పాకిస్తాన్‌తో పంచుకుంటుంది. ఈ ఉపగ్రహాలను నిఘా కోసం ఉపయోగిస్తారు. ఇది యుద్ధం లేదా ఉద్రిక్తత సమయాల్లో శత్రువుల కదలికలను ట్రాక్ చేయడంలో సహాయపడుతుంది. భారత్ పాకిస్తాన్ సైనిక సంఘర్షణ సమయంలో, భారత రక్షణ మంత్రిత్వ శాఖతో అనుబంధంగా ఉన్న సెంటర్ ఫర్ జాయింట్ వార్‌ఫేర్ స్టడీస్ చైనా పాకిస్తాన్‌కు ఉపగ్రహ డేటా వైమానిక రక్షణ సహాయాన్ని అందించింది.

**భారత సైనిక కార్యకలాపాలను పర్యవేక్షించడం**

యోగాన్41 వంటి చైనా ఉపగ్రహాలు భారత దళాల కదలికలు, వైమానిక రక్షణ వ్యవస్థలు , క్షిపణుల కదలికలను సరైన సమయంలో ట్రాక్ చేశాయి. ఈ సమాచారం పాకిస్తాన్‌కు అందింది. ఇది దాని వ్యూహాన్ని మెరుగుపరచడంలో సహాయపడింది. 2025 ఏప్రిల్ 22న పహల్గామ్ లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత భారతదేశం ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించినప్పుడు, చైనా పాకిస్తాన్‌కు భారత సైనిక స్థావరాల ఉపగ్రహ చిత్రాలు, రాడార్ సమాచారాన్ని అందించింది. వాయు రక్షణ వ్యవస్థల పునర్నిర్మాణం, రాడార్లు ,క్షిపణి వ్యవస్థలు వంటి రక్షణ వ్యవస్థలను పునర్వ్యవస్థీకరించడానికి చైనా పాకిస్తాన్‌కు సహాయం చేసింది. దీనివల్ల పాకిస్తాన్ భారత వైమానిక దాడులను బాగా ట్రాక్ చేయగలిగింది.

**చైనా తయారీ ఆయుధాల వాడకం**

ఈ ఘర్షణలో పాకిస్తాన్ చైనా తయారీ J10C ఫైటర్ జెట్‌లు , PL15 క్షిపణులను ఉపయోగించింది. ఈ ఆయుధాల ప్రభావాన్ని పరీక్షించడానికి చైనా ఉపగ్రహ డేటా ద్వారా యుద్ధం గురించి సమాచారాన్ని సేకరించింది.

చైనాపాకిస్తాన్ అంతరిక్ష సహకారం

చైనా ,పాకిస్తాన్ మధ్య అంతరిక్ష సహకారం పెరుగుతోంది. 2025లో పాకిస్తాన్ యొక్క మొట్టమొదటి ఆప్టికల్ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహం PRSS1 ఇతర ఉపగ్రహాలను ప్రయోగించడానికి డ్రాగన్ సహాయపడింది. పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ జూన్ 2025లో చైనాతో నిఘా సమాచారాన్ని పంచుకోవడం సాధారణమని అంగీకరించారు, ఎందుకంటే రెండు దేశాలు భారత్ తో ఉద్రిక్త సంబంధాలను కలిగి ఉన్నాయి. పాకిస్తాన్‌కు చైనా ఉపగ్రహ డేటాను అందించడం వల్ల ప్రాంతీయ, ప్రపంచ భద్రతకు ముఖ్యంగా యుద్ధ సమయాల్లో అనేక తీవ్రమైన ముప్పులు తలెత్తుతాయి.

**భారతదేశానికి రెండు వైపులా సవాళ్లే**

భారతదేశం ఇప్పుడు తన సైనిక వ్యూహాలలో రెండు వైపులా ఉన్న పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటుంది. అంటే పాకిస్తాన్ , చైనా రెండింటి నుండి ఒకేసారి ముప్పు. చైనా ఉపగ్రహ మద్దతుతో పాకిస్తాన్ సైనిక సామర్థ్యాలు పెరుగుతాయి. భారతదేశం దాని పశ్చిమం వైపు (పాకిస్తాన్), ఈశాన్యం చైనా సరిహద్దులపై ఏకకాలంలో దృష్టి పెట్టవలసి వస్తుంది. భారత్‌పాకిస్తాన్ మధ్య జరిగిన ఘర్షణ సమయంలో చైనా ఉపగ్రహాలు భారత సైనిక స్థావరాల గురించి సమాచారాన్ని పాకిస్తాన్‌కు అందించాయి. దీనివల్ల పాకిస్తాన్ తన క్షిపణి , డ్రోన్ దాడులను బాగా లక్ష్యంగా చేసుకోగలిగింది.

**అణు యుద్ధ ముప్పు**

భారత్ ,పాకిస్తాన్ రెండూ అణ్వాయుధ దేశాలు. ఉపగ్రహ డేటా ద్వారా పాకిస్తాన్ సైనిక ఖచ్చితత్వాన్ని పెంచడం వల్ల యుద్ధం వేగంగా పెరుగుతుంది. అటువంటి పరిస్థితి అదుపులేని అణు యుద్ధానికి దారితీస్తుందని నిపుణులు హెచ్చరించారు. అయితే 2025 మేలో జరిగిన సంఘర్షణలో అణ్వాయుధాలను కూడా పరిగణించలేదని.. కానీ ఉపగ్రహ సహాయం యుద్ధాన్ని మరింత క్లిష్టతరం చేసిందని ఖవాజా ఆసిఫ్ అన్నారు.

**చైనా వ్యూహాత్మక ప్రయోజనం**

చైనా తన ఆయుధాలు, ఉపగ్రహ వ్యవస్థలను పరీక్షించుకోవడానికి ఈ సంఘర్షణను ఒక అవకాశంగా ఉపయోగించుకుంది. చైనా ఆయుధాల పనితీరు సగటు కంటే తక్కువగా ఉందని భారత రక్షణ నిపుణుడు అశోక్ కుమార్ అన్నారు. కానీ ఉపగ్రహ డేటా చైనాకు S400 వాయు రక్షణ వ్యవస్థ వంటి భారతదేశ సైనిక వ్యూహాల బలహీనతలను అర్థం చేసుకోవడానికి అవకాశం కల్పించింది. ఈ సమాచారం భవిష్యత్తులో భారతదేశం లేదా ఇతర దేశాలకు వ్యతిరేకంగా దాని వ్యూహంలో చైనాకు సహాయపడుతుంది.

**ప్రాంతీయ అస్థిరత**

చైనాపాకిస్తాన్ సహకారం దక్షిణాసియాలో ఉద్రిక్తతలను పెంచుతుంది. భారతదేశం దీనిని యుద్ధంగా అభివర్ణించింది. ఇక్కడ చైనా నేరుగా యుద్ధంలో పాల్గొనకుండా పాకిస్తాన్ ద్వారా భారతదేశాన్ని బలహీనపరచడానికి ప్రయత్నిస్తుంది. ఇది భారతదేశంఅమెరికా వంటి కూటములకు చైనాపాకిస్తాన్ వంటి కూటములకు మధ్య ప్రపంచ ఉద్రిక్తతలను పెంచుతుంది.

**చైనాపై ఆధారపడటం...**

చైనా ఉపగ్రహ , సైనిక సహాయం పాకిస్తాన్ చైనాపై ఆధారపడటాన్ని పెంచుతోంది. చైనాపాకిస్తాన్ ఆర్థిక కారిడార్ కింద డ్రాగన్ పాకిస్తాన్‌లో బిలియన్ల డాలర్లు పెట్టుబడి పెట్టింది. కానీ ఇది అప్పుల ఉచ్చులో చిక్కుకునే ప్రమాదం ఉంది. యుద్ధ సమయాల్లో చైనా వ్యూహంలో పాకిస్తాన్‌ను పావుగా మారే అవకాశం ఛాన్స్ ఉంటుంది. ఇది వారి స్వేచ్ఛను హరించుకోవడమే అవుతుంది.

**హైటెక్ యుద్ధాల ముప్పు**

ఆధునిక యుద్ధం ఇకపై సరిహద్దులు దాటడం లేదా భూభాగాన్ని ఆక్రమించుకోవడం మాత్రమే కాదని ఖవాజా ఆసిఫ్ అన్నారు. ఉపగ్రహ డేటా , 5G కమ్యూనికేషన్ వ్యవస్థలను ఉపయోగించి సైబర్ , హైటెక్ రంగంలో ఇప్పుడు యుద్ధం జరుగుతోంది. దీనికి భారతదేశం వంటి దేశాలు తమ సైబర్ భద్రత , అంతరిక్ష ఆధారిత నిఘా వ్యవస్థలను మరింత బలోపేతం చేయవలసి ఉంటుంది.

**భారతదేశ భవిష్యత్తు వ్యూహం**

భారత్ అంతరిక్ష ,సైనిక సామర్థ్యాలను పెంచుకునే దిశగా చర్యలు తీసుకుంది. మే 2025 సంఘర్షణలో భారతదేశం తన 10 ఉపగ్రహాలను ఉపయోగించి పాక్ సైనిక కార్యకలాపాలను పర్యవేక్షించింది. అయితే దాని అంతరిక్ష సామర్థ్యాలు చైనా కంటే తక్కువగా ఉన్నాయని భారతదేశం అంగీకరించింది. ఇస్రో రాబోయే ఐదేళ్లలో నావిగేషన్ విత్ ఇండియన్ కాన్స్టెలేషన్ వ్యవస్థతో సహా 52 ఉపగ్రహాల శ్రేణిని ప్రయోగించాలని ప్రయత్నిస్తోంది.

**సైనిక వ్యూహంలో మార్పు**

భారతదేశం ఇప్పుడు తన సైనిక వ్యూహాలలో చైనా, పాకిస్తాన్ రెండింటినీ దృష్టిలో ఉంచుకుంటుంది. 7,000 కిలోమీటర్ల పొడవైన సరిహద్దును రక్షించుకోవాల్సిన ఈ రెండుముఖాల పరిస్థితి భారతదేశానికి పెద్ద సవాల్ గా మారింది. ఆపరేషన్ సిందూర్‌లో స్వదేశీ ఆయుధాలు , S400 వ్యవస్థను ఉపయోగించి పాకిస్తాన్ దాడులను తిప్పికొంట్టింది. ఇది భారతదేశం యొక్క స్వావలంబనను పెంచింది. చైనా, పాక్ వస్తున్న వస్తున్న సవాళ్లను ఎదుర్కోవడానికి భారతదేశం తన అంతరిక్ష, సైబర్ , సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకోవాలి. ఈ పరిస్థితి దక్షిణాసియాలో అధికార సమతుల్యతను మరింత క్లిష్టతరం చేస్తుంది. అమెరికా, రష్యా వంటి ప్రపంచ శక్తులు ఈ ప్రాంతంలో తమ వ్యూహాలను పునఃపరిశీలించవలసి వస్తుంది.



# దిగొస్తున్న బంగారం ధరలు

ఇరాన్‌ఇజ్రాయెల్ యుద్ధం ముగియడం.. అంతర్జాతీయంగా సానుకూల పవనాలు వీయడంతో బంగారం ధరలు దిగొస్తున్నాయి. అమెరికాచైనా మధ్య వాణిజ్య ఒప్పందంపై ఆశా జనక నివేదికలు రావడంతో పెట్టుబడిదారులు బంగారంపై అమ్మకాలకు మొగ్గు చూపారు. దీనికి తోడు లాభాల స్వీకరణ కూడా తోడవడం తో పసిడి ధర ఒక్కరోజే భారీగా దిగివచ్చింది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.930 తగ్గి రూ.97,670కి చేరింది.మరోవైపు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఇప్పట్లో తగ్గించే అవకాశం లేదని ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు కూడా బులియన్ ధరల పతనానికి కారణమయ్యాయని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేది తెలిపారు. అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ బలహీనపడటంతో పెట్టుబడిదారులు బంగారం నుంచి తమ నిధులను ఈక్విటీలు, క్రిప్టోకరెన్సీల వంటి రిస్క్ ఉన్న ఆస్తుల్లోకి మళ్లిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.




## సర్వీస్ నెట్‌వర్క్ విస్తరణపై దృష్టిసారించిన

# మారుతీ సుజుకీ..!

ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ తమ సర్వీస్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించేందుకు కృషి చేస్తోంది. ప్రస్తుతం 5,400 టచ్‌పాయింట్లతో ఉన్న సర్వీస్ నెట్‌వర్క్‌ను 2030-31 నాటికి 8,000కు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. వివిధ రకాల కస్టమర్ల అవసరాలను తీర్చడంతో పాటు, తమ ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) ఆవిష్కరణలకు కూడా ఈ విస్తరణ ఉపయోగపడుతుందని మారుతీ సుజుకీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ హిసాషి తకెయిచి తెలిపారు. 1,000కి పైగా నగరాల్లో 1,500 ఈవీసపోర్టెడ్ సర్వీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ స్టేషన్లలో సుశిక్షిత సిబ్బంది, అధునాతన పరికరాలు అందుబాటులో ఉంటాయని తకెయుచి పేర్కొన్నారు. మే నెలలో కంపెనీ 24.5 లక్షల వాహనాలకు సర్వీస్ అందించినట్లు ఆయన తెలియజేశారు.అత్యవసర సమయాల్లో కస్టమర్లకు సహాయం అందించేందుకు మారుతీ సుజుకీ ప్రత్యేకమైన క్విక్ రెస్పాన్స్ టీమ్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఇది ఎమర్జెన్సీ ఆన్‌రోడ్ అసిస్టెన్స్ సేవలను అందిస్తుంది. అంతేకాకుండా, సర్వీస్ కార్యకలాపాలకు సహకారంగా ఏఐ ఆధారిత చాట్‌బాట్‌లు మరియు వాయిస్ బాట్‌లను కూడా కంపెనీ ప్రవేశపెట్టింది.




# ఇన్వెస్టర్ల కాన్ఫిడెన్స్... లాభపడిన సూచీలు



మూర్తి నాయుడు పాదం
నిఫ్ట్ మాస్టర్
స్టాక్ మార్కెట్ అనలిస్ట్
+91 988 555 9709

గ్లోబల్ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు రావడం, జియో పొలిటికల్ వివాదాలు చల్లబడటం, ఇన్వెస్టర్లలో ఆత్మవిశ్వాసం పెరగడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభపడ్డాయి. ఎనర్జీ, చమురు, బ్యాంకింగ్ రంగాల షేర్లు ఇందుకు దోహదం చేశాయి. ఉదయం బెంచ్‌మార్క్ సూచీలు కనిష్ఠ స్థాయుల్లోనే మొదలయ్యాయి. క్రమంగా సెంటిమెంటు బలపడటం, ఆటోపోట్లు కలిగించే పరిస్థితులు లేకపోవడం, ఇన్వెస్టర్లు కొనుగోళ్లు చేపట్టడంతో గరిష్ఠ స్థాయులకు చేరాయి. చివరి వరకు అలాగే రేంజుబౌండ్లో కొనసాగాయి. చివరికి నిఫ్టీ 88 పాయింట్ల లాభంతో 25,637 వద్ద, సెన్సెక్స్ 303 పాయింట్ల లాభంతో 84,058 వద్ద స్థిరపడ్డాయి. మార్కెట్లు వరుసగా రెండో వారమూ బలంగా క్లోజవ్వడం గమనార్హం.

క్రితం సెషన్లో 83,755 వద్ద ముగిసిన బీఎస్ఈ సెన్సెక్స్ శుక్రవారం 83,774 వద్ద మొదలైంది. 83,645 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. 84,089 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని అందుకుంది. చివరికి 303 పాయింట్ల లాభంతో 84,058 వద్ద ముగిసింది. 25,576 వద్ద ఓపెనైన ఎన్ఎస్ఈ నిఫ్టీ 25,223 వద్ద కనిష్ఠ, 25,654 వద్ద గరిష్ఠ స్థాయుల్ని అందుకుంది. మొత్తంగా 88 పాయింట్లు పెరిగి 25,637 వద్ద క్లోజైంది. నిఫ్టీ బ్యాంకు 237 పాయింట్లు ఎగిసి 57,443 వద్ద స్థిరపడింది. నిఫ్టీ50లో 26 కంపెనీలు లాభపడగా 23 నష్టపోయాయి. జియోఫైనాన్స్, ఏసియన్ పెయింట్స్, అపోలో హాస్పిటల్స్, ఇండస్ఇండ్ బ్యాంకు, అదానీ ఎంటర్‌ప్రైజెస్ టాప్ గెయినర్స్. టాటాకన్జూమర్, డాక్టర్ రెడ్డీస్, ట్రెంట్, విప్రో, ఎటర్నల్ టాప్ లూజర్స్. చమురు, ఎనర్జీ, కమోడిటీస్, పీఎస్ఈ, హెల్త్‌కేర్, ఎంఎన్‌సీ, ఫార్మా, పీఎస్యూ బ్యాంకు సూచీలు కళకళలాడాయి. రియాల్టి, ఐటీ, కన్జూమర్ డ్యురబుల్స్, ఎఫ్ఎంసీజీ సూచీలు ఎరుపెక్కాయి. నేడు మార్కెట్ బ్రెడ్త్ బయ్యర్లకు అనుకూలంగా ఉంది. 2986 స్టాక్స్ ట్రేడవ్వగా 1681 లాభపడ్డాయి. 1229 నష్టపోయాయి. 52వారాల గరిష్ఠాన్ని 86 షేర్లు 52వారాల కనిష్ఠాన్ని 24 షేర్లు తాకాయి. అప్పర్ సర్క్యూటును 105, లోయర్ సర్క్యూటును 40 షేర్లు చేరాయి. నైకాకు రూ.216 టార్గెట్ ధరతో నొమురా న్యూట్రల్ రేటింగ్ కొనసాగించింది. ఆగస్టు లోపు టైర్2 బాండ్లు జారీ చేసి రూ.5000 కోట్ల సమీకరించాలని ఎస్బీఐ భావిస్తున్నట్టు తెలిసింది. కొలంబో డాక్ యార్డ్ అక్విజిషన్‌కు మాజ్‌డాక్ షిప్‌బిల్డర్స్ బోర్డు ఆమోదించింది. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీవోకు మూడోరోజు మధ్యాహ్నానికి 10.91 రెట్ల స్పందన లభించింది. అహ్లువాలియా కాంట్రాక్ట్స్ కంపెనీ రూ.1103 కోట్ల విలువైన రెండు కాంట్రాక్టులను దక్కించుకుంది. మూడో రోజు మధ్యాహ్నానికి సంభవ్ స్టీల్ ఐపీవోకు 16.29 రెట్ల స్పందన వచ్చింది. డాలరుతో పోలిస్తే రూపాయి 19 పైసలు బలపడి 85.51 వద్ద స్థిరపడింది. సిటీ రీసెర్చ్ టార్గెట్ ధరను తగ్గించడంతో డాక్టర్ రెడ్డీస్ షేర్లు వరుసగా రెండోరోజూ నష్టపోయాయి. ఏడు రోజుల వేరియబుల్ రేట్ రిజర్వ్ రెపో ఆక్షన్ ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి రూ.84,974 కోట్ల లిక్విడిటీని ఆర్బీఐ తొలగించింది. రూ.670 టార్గెట్ ధరతో వరుణ్ బెవరేజెస్‌కు హెచ్ఎస్‌బీసీ బయ్ రేటింగ్ కొనసాగించింది. రూ.210 టార్గెట్ ధరతో గెయిల్‌కు జెఫ్రీస్ బయ్ రేటింగ్ రిటెయిన్ చేసింది.





## ఎయిరిండియా ప్రమాద బాధితుల కోసం

# రూ.500 కోట్ల ట్రస్ట్..!

అహ్మదాబాద్ విమాన ప్రమాదం దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే. ఎయిరిండియాకు చెందిన విమానం కూలిపోయి 275 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ విమాన దుర్ఘటనను టాటా సంస్థ చాలా సీరియస్‌గా తీసుకొంది. ఈ నేపథ్యంలో ప్రమాద బాధితుల కుటుంబీకుల కోసం టాటా సన్స్ గొప్ప నిర్ణయం తీసుకుంది. మధ్యంతర బోర్డు సమావేశంలో ఈ మేరకు రూ.500 కోట్ల ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేసే ప్రతిపాదనపై చర్చలు జరిగినట్లు సమాచారం. ఈ ట్రస్ట్ బాధితుల కుటుంబాలకు వైద్య సహాయం, విద్య, ఉద్యోగావకాశాలు తదితర రూపాల్లో మద్దతు అందించనుంది.ఈ ప్రతిపాదనపై టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ స్పందిస్తూ, బాధితులకు దీర్ఘకాలిక సహాయం అందించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కంపెనీ తన బాధ్యతల నుంచి వెనక్కి తగ్గదని, అన్ని రకాల చర్యలూ తీసుకుంటామని హామీ ఇచ్చారు. వాస్తవానికి తొలుత టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ రెండు వేర్వేరు ట్రస్ట్‌లను ఏర్పాటుచేయాలని భావించింది. వీటిల్లో ఒకటి భారతీయ బాధితుల కుటుంబాలను చూసుకొనేందుకు కాగా.. మరొకొటి విదేశీ బాధితుల కుటుంబాల కోసం. ఇక తాజాగా ట్రస్ట్‌కు కేటాయించే సొమ్ముతో మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించడం, క్షతగాత్రుల వైద్య ఖర్చులు, మెడికల్ కాలేజీ పునరుద్ధరణ, సమీపంలో విమాన శకలాల కారణంగా దెబ్బతిన్న వాటిని పునరుద్ధరించడం వంటి పనులు చేపట్టనుంది. మిగిలిన మూల నిధిని బాధిత కుటుంబాల దీర్ఘకాలిక అవసరాలు తీర్చడానికి వినియోగించాలని భావిస్తున్నారు. త్వరలోనే ట్రస్ట్‌ను రిజిస్టర్ చేసే అవకాశం ఉంది.



# రిషభ్ పంత్ సమాధానం షాకింగ్: అజయ్ జడేజా

రిషభ్ పంత్ టీమిండియా తరపున బెస్ట్ టెస్ట్ క్రికెటర్ గా పాపులర్ అయ్యారు. ఇంగ్లాండ్ తో లీడ్స్‌లోని హెడింగ్లీ వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అద్భుత రీతిలో సెంచరీలు సాధించాడు. ఈ ఫీట్ సాధించిన ఫస్ట్ ఆసియా, మొదటి భారత బ్యాటర్ గా రికార్డు క్రియేట్ చేశారు. బ్యాటింగ్ లోనే కాదు, అతడి తీరులోనూ ఆత్మవిశ్వాసం ఉంటుంది. అందుకే కారు ప్రమాదానికి గురై మళ్లీ ఆత్మవిశ్వాసంతో టీమిండియాలోకి వచ్చి ఏ మాత్రం తడబాటు లేకుండా తిరిగి సత్తా చాటుతున్నాడు. పంత్ కు తనమీద తనకున్న నమ్మకాన్ని టీమిండియా మాజీ క్రికెటర్ అజయ్ జడేజా వివరించాడు. రిషభ్ పంత్ కు సుమారు 18 సంవత్సరాల వయసున్నప్పుడు 2015 16 సీజన్‌లో అతణ్ని ఢిల్లీ తరపున రంజీ ట్రోఫీకి సెలక్టర్లు సెలెక్ట్ చేయలేదు. ఆ టైమ్ లో అజయ్ జడేజా ఢిల్లీ టీమ్ మెయిన్ కోచ్ గా ఉన్నాడు. రంజీ ట్రోఫీ జట్టులో పంత్ కు చోటు దక్కకపోయినా, ట్రైనింగ్ సెషన్ కు హాజరు కావాలని తాను అతణ్ని కోరినట్లు జడేజా తెలిపారు. అయితే, పంత్ ఇచ్చిన సమాధానం తనని ఆశ్చర్యపరిచిందని చెప్పాడు. నేను 2015లో కొన్ని రోజులు ఢిల్లీ కోచ్ గా ఉన్నాను. సెలక్టర్లు పంత్ ను రంజీట్రోఫీకి ఢిల్లీ టీమ్ తరపున సెలెక్ట్ చేయలేదు. అయినా ప్రాక్టీస్ సెషన్ కు



హాజరు కావాలని నేను పంత్ కు చెప్పాను. ప్రస్తుతం సెలెక్ట్ కాకపోయినా ఫర్వాలేదు.. భవిష్యత్తులో అవకాశం ఉంటుందని చెప్పా. దానికి అతడు.. ఏం ఫర్వాలేదు. వారికి నా అవసరం పడినప్పుడు.. వారే నన్ను ఇంటి నుంచి తీసుకువెళతారు అని పంత్ సమాధానం చెప్పాడు. అది విని నేను షాకయ్యా అని జడేజా గుర్తు చేసుకున్నాడు. తర్వాత పంత్ అనూహ్యంగా ఆ సీజన్‌లోనే జట్టులో అడుగు పెట్టాడు. ఎంట్రీ ఇచ్చిన మ్యాచ్‌లోనే అర్ధ సెంచరీ సాధించాడు.



# కేఎల్ రాహుల్ సూపర్: హేమంగ్ బదానీ

టీమిండియా క్రికెటర్ కేఎల్ రాహుల్ వ్యక్తిగత జీవితం కన్నా క్రికెట్ కే ఇంపార్టెన్స్ ఇస్తున్నాడని ఐపీఎల్ ఫ్రాంచైజీల్లో ఒకటైన ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్ హేమంగ్ బదానీ ప్రశంసించారు. మార్చిలో ఫస్ట్ టైమ్ తండ్రిగా మారిన రాహుల్ కుటుంబంతో సమయం గడపడానికంటే, ఇంగ్లాండ్ పర్యటనకు ప్రాముఖ్యం ఇచ్చాడన్నాడు. టెస్ట్ క్రికెట్‌కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తమ రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత ప్రజెంట్ ఇండియన్ టీమ్ లో కేఎల్ రాహుల్ అత్యంత సీనియర్ బ్యాటర్‌గా మారాడు. మార్చిలో అతడి భార్య అతియాశెట్టి మొదటి బిడ్డకు జన్మనిచ్చారు. ఈనేపథ్యంలో కుటుంబంతో సమయం గడపడానికంటే అతడు టీమిండియా కోసం ఆడటానికే ఇంపార్టెన్స్ ఇచ్చాడు. ఇంగ్లాండ్ లయన్స్‌తో అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ స్వచ్ఛందంగా పార్ట్ అయ్యారు. ఈ క్రమంలో సెంచరీ కూడా చేశారు. అలాగే లీడ్స్ వేదికగా ఇంగ్లాండ్ తో జరిగిన మొదటి టెస్ట్, రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీ సాధించాడు. దేశానికే మొదటి ప్రాధాన్యం హేమాంగ్ భాయ్ అని ఇంగ్లాండ్‌కు బయలుదేరే ముందు రాహుల్ తనతో అన్నాడని బదానీ మీడియాకు తెలిపారు. నేను ఇంగ్లాండ్ కు భారత జట్టు కంటే కాస్త ముందుగా వెళ్లాలనుకుంటున్నాను. ప్రధాన టెస్ట్ సిరీస్ కంటే ముందు నేను సన్నాహక మ్యాచ్ లు ఆడాలనుకుంటున్నాను. నాకు వ్యక్తిగత జీవితం కంటే కూడా దేశమే ముఖ్యం అని కేఎల్ రాహుల్ చెప్పడం నిజంగా గ్రేట్. ఓ సీనియర్ బ్యాటర్ గా కేఎల్ రాహుల్ తన పాత్ర పోషించాడు అని హేమంగ్ బదానీ అతన్ని కొనియాడాడు. ఇంగ్లాండ్ టూర్ లో కేఎల్ రాహుల్ ఇప్పటివరకు మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఇంగ్లాండ్ లయన్స్ తో, ఇండియా ఏ జట్టు తలపడిన రెండో అనధికార టెస్ట్ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 116, రెండో ఇన్నింగ్స్‌లో 51 పరుగులు చేశాడు.

# వెస్టిండీస్ క్రికెటర్‌పై లైంగిక దాడి ఆరోపణలు



వెస్టిండీస్ కు చెందిన ఓ క్రికెటర్ పై లైంగిక దాడి ఆరోపణలు వచ్చాయి. ఓ యువతిని అతను లైంగికంగా వేధించినట్లు గయానాలో కంప్లైంట్ ఫైల్ అయ్యింది. అయితే ఆ క్రికెటర్ మరో 11 మంది మహిళలను కూడా లైంగికంగా వేధించినట్లు తెలుస్తోంది. ఆ క్రికెటర్ ఎవరన్నది తెలియలేదు. అతను గయానాకు చెందినట్లు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం అతను వెస్టిండీస్ నేషనల్ టీమ్ లో ఆడుతున్నట్లు తెలిపారు. లైంగిక వేధింపులు, దాడులు, అత్యాచారం జరిగినట్లు ఆరోపణలు ఉన్నా.. ఆ క్రికెటర్ పై మాత్రం ఇప్పటి వరకు ఎటువంటి కేసు నమోదు కాలేదు. వెస్టిండీస్ క్రికెట్ బోర్డు కూడా దీనిపై అఫిషియల్ గా ఎలాంటి అనౌన్స్ మెంట్ చేయలేదు. ఆ ప్లేయర్ వివరాలు బయటకు రాకుండా ఉండేందుకు క్రికెట్ బోర్డు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం విండీస్ జట్టులో అతనో కీలక ప్లేయర్ అని తెలిసింది. ఈ విషయం తమకు పూర్తిగా తెలియదని, కామెంట్ చేసే స్థితిలో లేమని విండీస్ బోర్డు ప్రెసిడెంట్ కిషోర్ షాలో తెలిపారు. 2024 జనవరిలో బ్రిస్బేన్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో ఆ క్రికెటర్ ఆడినట్లు ఓ లాయర్ తెలిపారు. ఆస్ట్రేలియాపై విజయం సాధించి స్వదేశానికి తిరిగి వచ్చిన సమయంలో అతనికి హీరో వెల్కమ్ ఇచ్చినట్లు కూడా చెప్పారు. కాగా తాజాగా ఈ ఘటనపై సోషల్ మీడియాలో దారుణమైన కామెంట్స్ వెల్లువెత్తుతున్నాయి.



# థర్డ్ సీజన్ లో దారుణమైన ప్రదర్శన.. హెడ్‌కోచ్‌పై వేటు!

మహిళల ప్రీమియర్ లీగ్ లో ట్రోఫీ కోసం వెయిట్ చేస్తున్న యూపీ వారియర్స్ తాజాగా షాకింగ్ నిర్ణయం తీసుకుంది. గత సీజన్ లో టీమ్ ప్రదర్శనతో తీవ్రంగా నిరాశ చెందిన యాజమాన్యం హెడ్‌కోచ్ జాన్ లెవిస్ కు ఉద్వాసన పలికింది. నాలుగో సీజన్‌కు కొత్త కోచ్ ఆధ్వర్యంలో పక్కాగా సన్నద్ధం కావాలనే ఉద్దేశంతో లెవిస్‌పై వేటు వేసింది. ఈ విషయాన్ని లేటెస్ట్ గా యూపీ యాజమాన్యం సోషల్ మీడియా వేదికగా తెలిపింది. ఫస్ట్ డే నుంచి మీరు మమ్మల్ని ఎంతగానో నమ్మారు. ఈ క్రమంలో యూపీ వారియర్స్ టీమ్ ఎన్నో ఎత్తుపల్లాలు చవిచూసింది. ఫ్రాంచైజీలోని క్రికెటర్లు ఎన్నో విషయాలు నేర్చుకున్నారు. మీరు ప్రశాంతంగా ఉంటూనే టీమ్ పురోగతి కోసం మనసుపెట్టి పనిచేశారు. కోచ్ జాన్ లెవిస్ మీ సేవలకు ధన్యవాదాలు. మీరు ఎల్లప్పుడూ యూపీ వారియర్స్ కుటుంబంలో సభ్యులే అంటూ సోషల్ మీడియా పోస్ట్‌లో రాసుకొచ్చింది యూపీ ఫ్రాంచైజీ. మహిళల క్రికెట్ ను కొత్త పుంతలు తొక్కించడం కోసం బీసీసీఐ 2023లో డబ్ల్యూపీఎల్‌ను స్టార్ట్ చేసింది. ఫస్ట్ సీజన్ నుంచి బరిలోకి దిగుతున్న ఐదు జట్లలో యూపీ వారియర్స్ ఒకటి. స్టార్టింగ్ ఎడిషన్ లో జాన్ లెవిస్ మార్గంలోనే యూపీ జట్టు ప్లే ఆఫ్స్ వరకూ వెళ్లింది. నాకౌట్ పోరు ముంబై ఇండియన్స్ చేతిలో ఓడి ఇంటిదారి పట్టింది. లాస్ట్ ఇయర్ జరిగిన టోర్నీలో యూపీ మూడు విక్టరీలతో నాలుగో స్థానంలో నిలిచింది. మొత్తంగా డబ్ల్యూపీఎల్‌లో ఆ జట్టు 25 మ్యాచుల్లో తొమ్మిదింట మాత్రమే గెలుపొందింది. ఇంగ్లండ్ మాజీ ఆటగాడైన జాన్ లెవిన్‌కు కోచ్‌గా సుదీర్ఘ అనుభవం ఉంది. డబ్ల్యూపీఎల్‌లో యూపీ వారియర్స్‌కు కోచింగ్ ఇస్తూనే ఆయన నిరుడు నవంబర్ 22 నుంచి ఈ ఏడాది మార్చి వరకూ ఇంగ్లండ్ మహిళల టీమ్‌కు సేవలందించాడు. దేశవాళీలో కౌంటీ క్రికెట్‌లో గ్లౌసెస్టర్‌షైర్, సర్రేతో పాటు సస్సెక్స్ జట్లుకు సైతం ఆడాడు లెవిస్. అయితే.. దేశం తరఫున మాత్రం ఆయన కెరియర్ కొన్ని రోజులే కొనసాగింది.



# మహిళల సింగిల్స్ మార్పు: పీవీ సింధు

మహిళల సింగిల్స్ ఎంతో మారిందని, అందుకు తగినట్లుగా తన ఆటను మార్చుకుంటున్నానని భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కామెంట్ చేశారు. మహిళల సింగిల్స్ పూర్తిగా మారిపోయింది. ఇంతకుముందు ఎటాక్, ఫాస్ట్ ర్యాలీలతో సాగేది. ఇప్పుడు సుదీర్ఘ ర్యాలీలతో సేఫెస్ట్ ఆటగా మారింది. దీనిపై ఇప్పుడు మేం ఫోకస్ చేస్తున్నాం. ముఖ్యంగా ర్యాలీని ఎక్కువసేపు పొడిగించడానికి ఎక్కువ ఓర్పు అనేది చాలా అవసరం. అందుకోసమే శ్రమిస్తున్నాం. ఆటలో మార్పు వస్తున్నప్పుడు మనం కూడా మార్పులు చేసుకోవాలి. ఒక అథ్లెట్‌గా నా ఆటను మార్చుకుంటూ వస్తున్నా. మార్చుకోవడానికి సమయం పట్టొచ్చు. కానీ ఎప్పటికప్పుడు మార్పులు చేసుకోవడం చాలా ముఖ్యం అని సింధు చెప్పింది. ఇంతకు ముందు నేను ఎటాక్ చేసేదాన్ని. కానీ ఇప్పుడు ప్రతి అథ్లెట్ డిఫెన్స్ బాగుంటుంది. 3040 స్ట్రోక్ ల పాటు ర్యాలీని కంటిన్యూ చేయడానికి ఎంత ఓర్పు అవసరమో చూస్తున్నాం. నేను ఫిట్‌నెస్, సహనశక్తిని టెస్ట్ చేసుకుంటూ ఉండాలి. ఎందుకంటే నేను కోర్టులో చాలా ఎక్కువ సమయం ఉండాల్సిన అవసరముంది అని ఆమె కామెంట్ చేశారు. కాగా పీవీ సింధు తన ఆటతో యావత్ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.




# తమ్ముడు మూవీకి 'A' సర్టిఫికేట్?

టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ ప్రస్తుతం తమ్ముడు మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఆ టైటిల్ తో కొన్నేళ్ల క్రితం వచ్చి ఐకానిక్ హిట్ అందుకున్నారు. ఇప్పుడు పవన్ ఫ్యాన్ అయిన నితిన్.. తమ్ముడు టైటిల్ తో థియేటర్లలో జులై 4వ తేదీ నుంచి సందడి చేయనున్నారు. వకీల్ సాబ్, ఎంసీఏ ఫేమ్ వేణు శ్రీరామ్ దర్శకత్వం వహించిన తమ్ముడు మూవీని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మాత దిల్ రాజు నిర్మించారు. యంగ్ బ్యూటీ సప్తమి గౌడ, వర్ష బొల్లమ్మ ఫిమేల్ లీడ్స్ లో నటిస్తున్నారు. సీనియర్ హీరోయిన్ లయ కీ రోల్ ప్లే చేస్తున్నారు. ఆమె నితిన్ కు అక్కగా కనిపించనున్నారు. స్ట్రాంగ్ రీ ఎంట్రీ ఇస్తున్నారు. అయితే సినిమా విడుదలకు మేకర్స్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తాజాగా సెన్సార్ ఫార్మాలిటీస్ ను కంప్లీట్ చేసుకున్నారు. సెన్సార్ బోర్డు అధికారుల నుంచి A సర్టిఫికెట్ అందుకున్నారు. దీంతో రిలీజ్ కు ముందు జరగాల్సిన అన్ని పనులను మేకర్స్ పూర్తి చేసుకున్నట్లు అయింది.

థియేటర్స్ లోకి వచ్చి ఆడియన్స్ ను ఆకట్టుకోవడమే మిగిలి ఉంది. అదే సమయంలో తమ్ముడు మూవీకి సంబంధించిన సెన్సార్ సర్టిఫికెట్ పై ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఎందుకంటే సినిమా సిస్టర్ సెంటిమెంట్ తో రూపొందుతున్న విషయం తెలిసిందే. అక్క కోసం ఏదైనా చేసే తమ్ముడి స్టోరీతో తెరకెక్కుతోంది. కాబట్టి తమ్ముడు సినిమాకి సెన్సార్ బోర్డ్ A సర్టిఫికెట్ ఇవ్వడం స్పెషలే. సినిమాలో విలేజ్ వైల్డ్ బ్యాక్ డ్రాప్ కారణంగా సెన్సార్ ఈ విధంగా జరిగినట్లు తెలుస్తోంది. ఇది చాలా ఇంట్రెస్టింగ్ అనే చెప్పాలి. దీంతో సినిమా కోసం వెయిట్ చేస్తున్నామని నెటిజన్లు, సినీ ప్రియులు కామెంట్లు పెడుతున్నారు. కాగా, ఇప్పటికే షూటింగ్ ను పూర్తి చేసిన మేకర్స్.. రీసెంట్ గా పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొత్తం కంప్లీట్ చేశారు. ప్రస్తుతం ప్రమోషన్స్ లో బిజీ అయిపోయారు. వరుస అప్డేట్స్ తో మేకర్స్ సినిమాపై బజ్ క్రియేట్ చేస్తున్నారు. మ్యూజికల్ అప్డేట్స్ తో అట్రాక్ట్ చేశారు. పోస్టర్స్, గ్లింప్సెస్ తో ఇప్పటికే ఆడియన్స్ లో బజ్ క్రియేట్ చేశారు. సినిమాపై అంచనాలు పెంచారు. అదే సమయంలో కథ గురించి ఫుల్ గా రివీల్ చేయకుండా ఇంట్రెస్ట్ నెలకొల్పుతున్నారు. దీంతో తమ్ముడు మూవీ హిట్ అవుతుందని అంతా ఎక్స్పెక్ట్ చేస్తున్నారు. నితిన్ కు సరైన హిట్ దక్కనుందని చెబుతున్నారు. మరి ఈ సినిమా ఎలాంటి సక్సెస్ ను అందుకుంటుందో చూడాలి.




# కన్నప్ప డే 1 కలెక్షన్ల ప్రిడిక్షన్

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ గా వచ్చిన కన్నప్ప మూవీ భారీ హంగులతో రిలీజ్ అయ్యింది. రివ్యూపై కూడా పబ్లిక్ టాక్ చాలా పాజిటివ్ గా ఉంది. ఈ సినిమాలో చాలామంది స్టార్ కాస్ట్ ఉండటంతో పాటు కథలో బలం కూడా ఉండటం వల్లే ఈ సినిమాకు ఈ హైప్ క్రియేట్ అయ్యిందని మేకర్స్ బలంగా నమ్ముతూ వచ్చారు. ముఖేష్ కుమార్ సింగ్ డైరెక్షన్ లో వచ్చిన ఈ హిస్టారికల్ డ్రామాకు విష్ణు కెరీర్ లోనే ది బెస్ట్ బుకింగ్స్ జరిగాయి. దీంతో తన కెరీర్ లో మంచి ఓపెనింగ్స్ రాబట్టే అవకాశం కనిపిస్తుంది. దీంతో వరల్డ్ వైడ్ గా మంచి కలెక్షన్లు వచ్చే ఛాన్స్ ఉన్నట్టు ట్రేడ్ సర్కిల్స్ లో ప్రిడిక్షన్స్ నడుస్తున్నాయి. ఇప్పుడు ఉన్న ట్రెండ్ లో 15 కోట్లకి పైగానే లేదా సర్ప్రైజింగ్ గా ఇంకా ఎక్కువే వరల్డ్ వైడ్ వసూళ్లు వచ్చే ఛాన్స్ ఉందట. మరి చూడాలి కన్నప్ప ఏ మేర రాబడుతుంది అనేది. ఇక ఈ సినిమాలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, మోహన్ బాబు, కాజల్ లాంటి స్టార్స్ నటించగా మోహన్ బాబు నిర్మాణం వహించారు. ఇక ఈ సినిమాపై భారీ హైప్ ను మొదట్నుండి క్రియేట్ చేశారు. దీంతో సినిమా అనుకున్నట్లుగా సక్సెస్ అవుతుందని హీరో మంచు విష్ణు చెబుతున్నారు.

# రష్మిక 'మైసా' గా ఊహించని ట్విస్ట్

ప్రస్తుతం నేషనల్ క్రష్ రష్మిక మందన్నా హీరోయిన్ గా బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్ట్స్ తో బిజీగా ఉంది. ఆమె నటించిన అన్ని సినిమాలు కూడా సూపర్ హిట్స్ గా నిలుస్తున్నాయి. మరి ఈ సినిమాల్లో లేటెస్ట్ గా ధనుష్, శేఖర్ కమ్ముల కాంబోలో చేసిన పాన్ ఇండియా సినిమా కుబేర కూడా ఒకటి. ఇలా హీరోయిన్ గా చేసిన అన్ని సినిమాలు భారీ బ్లాక్ బస్టర్స్ హిట్ అయ్యిన నేపథ్యంలో తన నుంచి నిన్నో సాలిడ్ అప్డేట్ వచ్చింది. తనపై ఒక సోలో సినిమాగా అనౌన్స్ చేసిన సినిమా తాలూకా టైటిల్ సహా ఇంటెన్స్ ప్రీ లుక్ పోస్టర్ ని మేకర్స్ ఇపుడు రిలీజ్ చేశారు. మరి ఇందులో రష్మిక మందన్నా ఒక ఊహించని అవతార్ లో ఉందని చెప్పాలి. ఇక ఈ సినిమాని దర్శకుడు రవీంద్ర పుల్లే దర్శకత్వం వహించగా ఈ సినిమాకి మైసా అనే పవర్ఫుల్ టైటిల్ ని లాక్ చేసి రిలీజ్ చేశారు. ఇదైతే మంచి అంచనాలు పెంచే విధంగానే ఉంది. ఇక ఈ సినిమాని పాన్ ఇండియా లెవెల్లో అనౌన్స్ చేయడం విశేషం. మరి ఈ సినిమాని అన్ ఫార్ములా ఫిల్మ్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు. అంతేకాకుండా ప్రజంట్ రష్మికకు బాలీవుడ్ లోనూ మంచి క్రేజ్ ఉంది. దీంతో తన నుండి ఓ సోలో ప్రాజెక్ట్ వస్తే ఖచ్చితంగా సక్సెస్ అవుతుందని మేకర్స్ బలంగా నమ్ముతారు.




# టాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ ఫోన్లు ట్యాప్ అయ్యాయా?



సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ సమంత ఫోన్ ను ట్యాప్ చేశారని, నాగచైతన్యతో డివోర్స్ అవ్వడానికి కూడా ఇదే కారణం అని లాస్ట్ ఇయర్ వైరల్ అయ్యింది. ఇక మరో హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ ఫోన్ నంబర్ ను కూడా ట్యాప్ చేశారని వైరల్ అయ్యింది. అంతేకాకుండా కేటీఆర్, రకుల్ మధ్య క్లోజ్ రిలేషన్ షిప్ ఉందని ప్రజంట్ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ బీజేపీ నేతలు బీఆర్ఎస్ అధికారంలో ఉన్న టైమ్ లో తెగ ఆరోపణలు చేశారు. ఇక లేటెస్ట్ గా ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలోకి హెబ్బా పటేల్ పేరు హైలెట్ అవుతుంది. హెబ్బా పటేల్ ఫోన్ ట్యాప్ చేసినట్లు తనకు సమాచారం వచ్చిందని, అయితే అది నిజమో కాదో తెలియదంటూ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. మరి అది నిజమో కాదో తెలియదు అని ఆయన చెప్పినప్పటికీ.. హెబ్బా పటేల్ ఫోన్ ట్యాప్ చేశారటా.. అంటూ సోషల్ మీడియా లో తెగ వైరల్ చేశారు. అయితే ఇప్పటివరకు ఈ రూమర్స్ పై అధికారులు రెస్పాన్డ్ కాలేదు. ఇపుడు ఫోన్ ట్యాపింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారుల టీమ్.. ఫోన్ ట్యాపింగ్ కు గురైన బాధితులందరికీ నోటీసులు, సమాచారం ఇచ్చి వారి నుండి ప్రత్యక్షంగా వాంగ్మూలం నమోదు చేస్తోంది. ఈ క్రమంలోనే ఆరువందలకు పైగా వ్యక్తుల ఫోన్లు ట్యాపింగ్ కు గురైనట్లు తెలుస్తుంది. మరి స్టార్ హీరోయిన్స్ దగ్గర్నుండి కూడా వాంగ్మూలం తీసుకుంటారా లేదా అనే ఆసక్తి తెలుగు రాష్ట్రాల్లో కలుగుతుంది. అయితే సిట్ టీమ్ వారి సేఫ్టీ విషయంలో మరికొన్ని జాగ్రత్తలు తీసుకునే అవకాశం కనిపిస్తుంది. ఏది ఏమైనా తెలుగు హీరోయిన్ల ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం విషయంలో మరికొన్ని రోజుల్లోనే క్లారిటీ రాబోతుంది. మరి ఈ విషయంపై సదరు హీరోయిన్లు ఏ విధంగా స్పందిస్తారనేది తెలియాలి.




## రచ్చ చేసే గ్యాంగ్ సీక్వెల్‌తో
# రీహంగామా

యూత్ ఫుల్ న్యూఏజ్ సినిమాలతో దర్శకుడిగా తనకంటూ ఓ స్పెషల్ ఇమేజ్ ను క్రియేట్ చేసుకున్న డైరెక్టర్ తరుణ్ భాస్కర్. పెళ్లి చూపులు వంటి బ్లాక్ బస్టర్ తరువాత తరుణ్ భాస్కర్ చేసిన న్యూ ఏజ్ స్టోరీ ఈ నగరానికి ఏమైంది?. ఈ మూవీతో విశ్వక్‌సేన్, సుశాంత్ రెడ్డి, అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమాను మంచి గుర్తింపుని సొంతం చేసుకున్నారు. 2018లో సురేష్ ప్రొడక్షన్స్ వారు కేవలం రూ.2 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తే ఏకంగా బాక్సాఫీస్ వద్ద రూ.12 కోట్లు రాబట్టి సంచలనం రేపింది. నటుడిగా విశ్వక్‌సేన్‌కు మంచి ప్లాట్ ఫామ్‌ని క్రియేట్ చేసింది. అంతే కాకుండా సోషల్ మీడియాలో మీమర్స్‌కి కావాల్సినంత స్టఫ్‌ని అందించి నెట్టింట నిత్యం వైరల్ అవుతూనే ఉంది. ఈ కామెడీ డ్రామాకు సీక్వెల్ ఉంటుందని గతంలోనే దర్శకుడు తరుణ్ భాస్కర్ ప్రకటించినా ఆ తరువాత ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో సీక్వెల్ ఇప్పట్లో ఉండదనుకున్నారు. కానీ అందరి అంచనాల్ని తలకిందులు చేస్తూ తరుణ్ భాస్కర్ సీక్వెల్ ప్రయత్నాలు మొదలు పెట్టాడు. సినిమా విడుదలైన ఇన్నేళ్ల తరువాత సీక్వెల్ చేస్తున్నామంటూ టీమ్ లేటెస్ట్ గా అనౌన్స్ చేసింది.

ఈ నగరానికి ఏమైంది గ్యాంగ్ మళ్లీ గ్యాదర్ అయింది అంటూ మేకర్స్ ఓ ప్రమోషనల్ పోస్టర్‌ని విడుదల చేస్తూ సీక్వెల్ అప్ డేట్ ఇచ్చారు. టీమ్ కన్యా రాశి వస్తోంది అంటూ ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్‌స్‌ని ఈ నెల 28, 29న ఇవ్వబోతున్నట్టు మేకర్స్ ప్రకటించారు. 1 బస్, త్రీ పబ్స్ అంటూ సినిమా కథ ఎలా ఉండనుందన్న హింట్ కూడా ఇచ్చేశారు. కీడా కోలా తరువాత మరో సినిమా ప్రకటించని తరుణ్ భాస్కర్ డైరెక్టర్‌గా మళ్లీ ఈ నగరానికి ఏమైంది మూవీనే నమ్ముకోవడంతో ఆయన అభిమానులు ఈ ప్రాజెక్ట్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఏడాదిన్నర తరువాత మళ్లీ మెగాఫోన్ పడుతున్న తరుణ్ భాస్కర్ ఈ సీక్వెల్‌తో మళ్లీ ట్రాక్‌లోకి రావాలనుకుంటున్నాడట. తనదైన మార్కు టేకింగ్‌తో సరికొత్త పంథాలో సీక్వెల్‌ని తరుణ్ భాస్కర్ తెరపైకి తీసుకురావాలనే ప్లాన్ లో ఉన్నాడట. ఆ ప్లాన్ ఏంటీ?.. ఇంతకీ సీక్వెల్ ఎలా ఉండబోతోంది అన్నది తెలియాలి.